Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 199 విశాఖపట్నం, 21 మే 2024 మంగళవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00



హారిక, హాసిని
కేటరింగ్ & కుకింగ్
బ్రాహ్మణ భోజనాలు
అతి తక్కువ ధరలకే లభించును
All Function Catering (Veg) Order Taken
ప్రొప్రైయిటర్ : సంతోష్ కుమార్
Ph : 8985488221
9014911305
పెదగదిలి, సింహగిరి కోలని, విశాఖపట్నం


## కిర్గిజ్‌స్థాన్ విద్యార్థుల కోసం కేంద్రమంత్రికి జీవీఎల్ లేఖ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బిజెపి సీనియర్ నాయకులు జీవీఎల్ నరసింహారావు నిన్న విదేశాంగ మంత్రి డా. ఎస్. జైశంకర్‌ని సంప్రదించి, మధ్య ఆసియా దేశమైన కిర్గిజిస్తాన్‌లో చదువుతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైద్య విద్యార్థుల భద్రత కోసం జోక్యం చేసుకోవాలని కోరారు.

కిర్గిజ్‌స్థాన్ రాజధాని నగరమైన బిష్‌కెక్‌లో భారతీయ విద్యార్థులతో సహా విదేశీ విద్యార్థులపై హింస మరియు దాడుల గురించి వచ్చిన వార్తల నేపథ్యంలో ఆ విద్యార్థులు మరియు వారి కుటుంబాలు ఆందోళనతో తమ భద్రత కోసం జీవీఎల్ ను అర్థించిన నేపథ్యంలో జీవీఎల్ వెంటనే స్పందించి వెంటనే తగు చర్యకై ఉపక్రమించడం జరిగింది.

కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్‌కెక్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమారు 2,000 మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తున్నారని జీవీఎల్ మంత్రికి లేఖలో తెలియచేయగా "బిష్కెక్‌లోని విద్యార్థుల రక్షణకు అవసరమైన తక్షణ చర్యలను ప్రారంభించమని భారత రాయబార కార్యాలయం అధికారులకు విదేశాంగ శాఖ మంత్రి తగు ఆదేశాలు జారీ చేశారు.

అక్కడి విద్యార్థులు సురక్షితంగా ఉండటానికి లేదా తిరిగి రావడానికై తగు ఏర్పాట్లు కోరుతూ విదేశాంగ శాఖ జోక్యాన్ని జీవీఎల్ నరసింహారావు తన లేఖలో అభ్యర్థించారు.

జీవీఎల్ అభ్యర్థనపై వెంటనే స్పందించిన డాక్టర్ ఎస్. జైశంకర్ కిర్గిజ్థాన్ లోని భారతీయ విద్యార్థులకు భద్రత కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

త్వరితగతిన స్పందించి సకాలంలో జోక్యం చేసుకున్నందుకు విదేశాంగ మంత్రికి జీవీఎల్ నరసింహారావు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై పలువురు విద్యార్థులు మరియు వారి తల్లి తండ్రులు జీవీఎల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## పూరీ రత్న భాండాగారంపై నితీష్‌కు మోదీ ప్రశ్న



**పూరీ:** సార్వత్రిక ఎన్నికలు ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో ప్రధాని మోదీ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం ఒడిశాలో పర్యటించిన ఆయన.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరీ జగన్నాథ ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం బీజేడీ ప్రభుత్వ పనితీరుపై ధ్వజమెత్తారు. ఆ పార్టీ పాలనలో దేవాలయానికి కూడా రక్షణలేకుండా పోయిందన్నారు.

"ఈ ప్రభుత్వ హయాంలో జగన్నాథుడి ఆలయం సురక్షితంగా లేదు. గత ఆరేళ్ల నుంచి రత్న భాండాగారం తాళం చెవులు కనిపించడం లేదు" అని మోదీ విమర్శించారు. కొద్దిరోజుల క్రితం కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇదే విషయంపై స్పందించిన సంగతి తెలిసిందే. "కొన్నాళ్లుగా కోట్లాదిమంది పూరీ జగన్నాథ్ స్వామి భక్తులు రత్నభాండాగారం గురించే ఆలోచిస్తున్నారు. ఈ భాండాగారం తాళం చెవుల మిస్టరీని బయటపెట్టాలని కోరుకొంటున్నారు. నవీన్ పట్నాయక్ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. వారి నమ్మకాలు, విశ్వాసాలతో ఆడుకుంటున్నారు. నకిలీ తాళాలు ఎవరు తయారుచేశారు?" అని ప్రశ్నించారు.

ఆ భాండాగారంలో అప్పటి రాజులు, భక్తులు దేవతామూర్తులకు కానుకగా సమర్పించుకున్న విలువైన ఆభరణాలు ఉన్నాయి. దీనిని 1985లో చివరిసారిగా తెరిచారు. చాలాకాలంగా దానిని తెరవనందున లోపల పరిస్థితి ఎలా ఉందన్న దానిపై స్పష్టత లేదు. దాంతో 2018 ఏప్రిల్ 4న భాండాగారం పరిశీలనకు వెళ్లిన నిపుణుల బృందం రహస్య గది తాళం చెవి లేకపోవడంతో లోపలికి వెళ్లలేకపోయింది. ఆ విషయం బయటకు తెలియడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమైంది.

2009 నుంచి ఒడిశాలో నవీన్ పట్నాయక్ (బీజేడీ) ప్రభుత్వం అధికారంలో ఉంది.

(మిగతా 2లో)

## అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో ఉగ్రవాదుల అరెస్ట్




దేశంలో నలుగురు ఐసిస్ ఉగ్రవాదులు పట్టుబడ్డారు. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు అక్కడి పోలీసులు. వారిని గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అధికారులు పట్టుకుని ప్రశ్నించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఐసిస్ ఉగ్రవాదులుగా గుర్తించిన ఈ ప్రత్యేక పోలీసుల బృందం ముందు వారిని అరెస్టు చేసింది. వీరంతా శ్రీలంకకు చెందిన వారిగా తెలిపింది. వీరిని ఇంటెన్సివ్ క్వెశ్చనింగ్ కోసం గుజరాత్ ఏటీఎస్

(మిగతా 2లో)

## గోదావరి డెల్టాలో ప్రతీ రోజు వర్షమే



**పశ్చిమగోదావరి జిల్లా:** పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలంలో సోమవారం మధ్యాహ్నం నుంచి ఆకాశం ఒక్క సారిగా మేఘ్యాతమై పలు మార్పులు చోటుచేసుకుని మేఘాలు మబ్బులు కమ్మేయడంతో అక్కడక్కడ చెదురు మొదురుగా వర్షాలు కురిసాయి. ఈ నేపథ్యంలో చల్లని గాలులు వేయడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మండలంలో ఆచంట కొడమంచిలి పెదమల్లం, కోడేరు, వల్లూరు, కరుగోరుమిల్లి పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు తదితర గ్రామాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతాంగంలో అలజడి నెలకొంది. పండించిన ధాన్యాన్ని ఒబిడి చేసుకునే పనిలో కొంతమంది రైతులు నిమగ్నమై ఉండగా, ధాన్యాన్ని విక్రయించేందుకు మరి కొంతమంది రైతులు ఎవరి పనిలో వారు ఉన్నారు. రాశులపై తడవకుండా ఉండేందుకు బరకాలు కప్పి కాపాడుకుంటున్నారు.




## జగదాంబ జంక్షన్ అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ జోన్-4 లో గల జగదాంబ జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను జీవిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. సోమవారం ఆయన జగదాంబ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న క్లాక్ టవర్, లేపాక్షి జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించారు.

ఈ పరిశీలనలో ముందుగా జగదాంబ జంక్షన్ క్లాక్ టవర్ ను పరిశీలించి సుందరీకరణ పనులకు తగు సూచనలు పర్యవేక్షక ఇంజనీర్ వినయ్ కుమార్ కు సూచించి త్వరితగతిన మే నెల ఆఖరు నాటికి పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం లేపాక్షి జంక్షన్ వద్ద కాలువ నిర్మాణ పనులను పరిశీలించి, సర్కిల్ అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలని, రోడ్ల, సెంటర్ మీడియన్ పనులను వెంటనే పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణ రాజును కమిషనర్ ఆదేశించారు.

జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్ట్ ఆఫీస్ వరకు అభివృద్ధి చేసిన రోడ్డుకు ఇరువైపులా రోడ్లపై, ఫుట్పాతులపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని జోన్-4 టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్ ప్రసాద్ కు కమిషనర్ ఆదేశించారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో జోన్-4 జోనల్ కమిషనర్ ప్రసాదరావు, కార్యనిర్వాహక ఇంజనీర్ సుబ్బారావు, డిడిహెచ్ దామోదర్ రావు, ఏసిపి ఝాన్సీ లక్ష్మి, ఏఎంఓహెచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హింసపై సిట్ ప్రాథమిక నివేదిక



**అమరావతి:** ఏపీలో ఎన్నికల పోలింగ్ రోజు, ఆ తర్వాత జరిగిన హింసపై సిట్ తన ప్రాథమిక నివేదికను డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు అందించింది. ఈ నివేదికను సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్ డీజీపీకి అందజేశారు. మూడు జిల్లాల్లో రెండు రోజుల పాటు పర్యటించిన ఈ బృందం.. నిన్న అర్ధరాత్రి వరకు ప్రత్యేక దర్యాప్తు కొనసాగించింది. పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో 33 హింసాత్మక ఘటనలు జరిగినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు గుర్తించారు. ఈ దమనకాండపై రెండు రోజులపాటు విచారణ జరిన సిట్.. అల్లర్లు జరిగిన ప్రాంతాలకు వెళ్లి పరిశీలించి విచారణ జరిపింది.

రాష్ట్రంలో హింసాత్మక ఘటనలపై సిట్ ఇచ్చిన 150 పేజీల నివేదికలో పలు కీలకాంశాలను పొందుపరిచింది. మూడు జిల్లాల్లో దాదాపు 33 హింసాత్మక ఘటనలు జరిగినట్లు తేల్చింది. పల్నాడు జిల్లాలోని 3 అసెంబ్లీ స్థానాల్లో 22 కేసులు, అనంతపురం జిల్లా తాడిపత్రిలో 7 కేసులు, తిరుపతి జిల్లాలోని 2 అసెంబ్లీ స్థానాల్లో 4 కేసులు నమోదైనట్లు సిట్ వెల్లడించింది. క్షేత్రస్థాయిలో పోలీసులు, బాధితులు, ఇతర వర్గాల నుంచి సాక్ష్యాలు సేకరించి నివేదిక రూపొందించినట్లు పేర్కొంది. 33 కేసుల్లో ఎఫ్ఐఆర్ ప్రకారం 1,370 మంది నిందితులుగా ఉన్నారని, ఇప్పటి వరకు 124 మంది అరెస్టయ్యారని తెలిపింది. మిగతావారిని కూడా అరెస్ట్ చేయాలని సూచించింది. రెండు వర్గాల ఘర్షణలు మరణాలకు కారణమై ఉండేవని తేల్చింది. కేసుల దర్యాప్తులోనూ తీవ్ర లోపాలు గుర్తించినట్లు సిట్ తన నివేదికలో పేర్కొంది.

మరోవైపు నమోదైన ఎఫ్ఐఆర్‌లో కొత్త సెక్షన్లు చేర్చే అంశంపైనా సిట్ సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. కొత్తగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలా? వద్దా అనే అంశంపైనా నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. హింస జరుగుతుందని తెలిసీ కొందరు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లుగా సిట్ నిర్ధరించింది. స్థానిక నేతలతో కుమ్మక్కైన పోలీసులు హింస జరుగుతున్నా.. మిన్నకుండి పోయారని ఈ నివేదికలో

(మిగతా 2లో)


మెగా బ్రాహ్మణ వివాహ వేదిక
తెలుగు బ్రాహ్మణ వధూవరుల
వివాహ పరిచయ కార్యక్రమం
విశాఖ సమాచారమ్ దినపత్రిక కార్యాలయం
9-3-16, పిఠాపురం కోలనీ, (కృష్ణా కాలేజ్ జంక్షన్, మెయిన్‌రోడ్డు) విశాఖపట్నం-530003



తేది : 26-05-2024, (ఆదివారం)
సమయం : మధ్యాహ్నం గం. 3.00 ల నుండి సాయంత్రం గం. 5.00 వరకు.
శ్రీకాకుళం నుండి విజయవాడ వరకు,
హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై,
బెంగుళూరు, పూణే వంటి ప్రముఖ
నగరాలలో పనిచేస్తున్న సుమారు
500 మంది వధూవరుల వివరములతో...
రిజిస్ట్రేషన్ మరియు వివరముల కొరకు
జనహిత మ్యాట్రిమోనీ
9393949345, 8074541283
Compli

## (మొదటి పేజీ తరువాయిలు)

### పూరీ రత్న భాండాగారంపై నితీష్‌కు మోదీ ప్రశ్న

2014లో మోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నవీన్ లోపాయికారీగా మద్దతు ఇస్తూ వస్తున్నారు. పార్లమెంటులో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులన్నింటికీ బీజేడీ మద్దతిచ్చింది. దీనికి బదులుగా కేంద్రం ఆ రాష్ట్రానికి అన్నివిధాలా సహకరించింది. ప్రస్తుత ఎన్నికల్లో రెండు పార్టీలు ఒంటరిగా పోటీ పడుతున్న సంగతి తెలిసిందే.

### అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో ఉగ్రవాదుల అరెస్ట్

అధికారులు ప్రత్యేకమైన ప్రాంతానికి తీసుకెళ్లారు.

అహ్మదాబాద్ విమానాశ్రయం చేరుకున్న వీరి కదలికలపట్ల అనుమానం వచ్చి ప్రశ్నించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఉగ్రవాదులు శ్రీలంక నుంచి చెన్నై మీదుగా అహ్మదాబాద్ చేరుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు ఎయిర్ పోర్టు అథారిటీ అధికారులు. కొందరి నివేదికల ప్రకారం ఈ పట్టుబడిన ఐసిస్ ఉగ్రవాదులు పాకిస్థాన్ హ్యాండ్లర్లతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదుల కదలికలతో దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో భద్రతను పెంచారు. క్వాలిఫయర్ మ్యాచ్ కోసం మూడు ఐపిఎల్ క్రికెట్ టీంలు అహ్మదాబాద్ విమానాశ్రయానికి రాకముందే ఈ అరెస్టులు జరగడంతో క్రికెట్ అభిమానులతో పాటు చాలా మందిలో ఆందోళన నెలకొంది.

### ఎన్నికల హింసపై సిట్ ప్రాథమిక నివేదిక

పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో కొందరు పోలీస్ అధికారులపైనా కేసులు నమోదు చేసే అవకాశం కనబడుతోంది. ఈ ఘటనల్లో ఉపయోగించిన రాళ్లు, కర్రలు, రాడ్లు వంటి సామగ్రికి సంబంధించిన ఆధారాలూ సేకరించిన సిట్.. ఈ ఘటనలతో సంబంధం ఉన్న పలువురు రాజకీయ నేతల్ని సైతం అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలపైనా కొన్ని సిఫారసులు చేసినట్లు తెలుస్తోంది. ఈ నివేదికను డీజీపీ.. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ప్రభుత్వం ద్వారా అందించనున్నారు. ఈ ఘటనలపై పూర్తి నివేదికను ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని సిట్ కోరే అవకాశం ఉంది.

### నరసరావుపేటలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన ఎన్వీ రమణ



**పల్నాడు:** ఎడ్యుకేషన్ అంటే మార్కులు ర్యాంకులే కాదని.. విజ్ఞాన సముపార్జనే ఎడ్యుకేషన్ ముఖ్య ఉద్దేశమని సుప్రీంకోర్టు మాజీ ఛీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. సోమవారం నర సరావుపేటలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ఎన్వీ రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరసరావుపేట లాంటి ప్రాంతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. గ్రామీణ విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో విద్యను అందించాలని ఈ పాఠశాల ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. భావితరాల భవిష్యత్తు అనేది విద్య మీదనే ఆధారపడి ఉంటుందని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, అత్యుత్తమ ఉద్యోగాలు సంపాదించి, ఉన్నత స్థాయికి ఎదిగిన మూలాలు మరిచిపోకూడదన్నారు. మనదైన సంస్కృతి, భాష, సంప్రదాయాలను గుర్తించుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సింది విద్యాసంస్థలే అని చెప్పుకొచ్చారు. దేశ విదేశాల్లో అత్యున్నత స్థాయిలో స్థిరపడిన స్వదేశం స్వగ్రామం మీద మమకారం మరువరాదన్నారు. ప్రపంచంలోనే భారత్ బలమైన శక్తిగా ఎదుగుతోందని... అందులో యువత, విద్యార్థులే కీలకపాత్ర పోషించనున్నారని మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, పాల్గొన్న సీనియర్ హైకోర్టు న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**విశాఖ సమాచారమ్**
**ప్రతులకు, ప్రకటనలకు**
**సెల్: 9393949345,**
**8247526179**

## హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ దుర్మరణం





టెహ్రాన్: ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ (63) హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ నిన్న దట్టమైన అటవీ ప్రాంతంలో కూలిపోయిన సంగతి తెలిసిందే. దీంతో సహాయక చర్యలు చేపట్టిన 'ఇరాన్ రెడ్ క్రిసెంట్ సొసైటీ' సోమవారం ఉదయం ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని గుర్తించింది. ఈ దుర్ఘటనలో రైసీ ప్రాణాలు కోల్పోయినట్లు ఇరాన్ ప్రభుత్వ వార్తాసంస్థ ఐఆర్ఎన్ఏ ధ్రువీకరించింది. ఆయనతో పాటు విదేశాంగ మంత్రి హొస్సేన్ అమీరబ్దొల్లహియన్ (60), తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్సు గవర్నర్ మలేక్ రహమతీ తదితరులు కన్నుమూసినట్లు ప్రకటించింది.

ఇరాన్-అజర్‌బైజాన్ సరిహద్దుల్లో కిజ్ కలాసీ, ఖొదావరిన్ అనే రెండు డ్యాంలను ఇరు దేశాలు నిర్మించాయి. అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియేవ్‌తో కలిసి రైసీ ఆదివారం వాటిని ప్రారంభించారు. అనంతరం విదేశాంగ మంత్రి హొస్సేన్, తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్సు గవర్నర్, తబ్రిజ్ ప్రావిన్సు ఇమామ్‌లతో కలిసి తబ్రిజ్ పట్టణానికి హెలికాప్టర్‌లో ప్రయాణమయ్యారు. మరో రెండు హెలికాప్టర్లూ వెంట బయలుదేరాయి. జోల్ఫా నగర సమీపంలోకి రాగానే.. రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రతికూల వాతావరణం కారణంగా అటవీ ప్రాంతంలో ప్రమాదానికి గురైంది.

ఈ ప్రదేశం దేశ రాజధాని టెహ్రాన్‌కు వాయవ్యాన దాదాపు 600 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రమాదం గురించి తెలియగానే త్రివిధ దళాలు శరవేగంగా సహాయక చర్యలు చేపట్టాయి. సోమవారం ఉదయం ఘటన జరిగిన కచ్చితమైన ప్రదేశాన్ని 'ఇరాన్ రెడ్ క్రిసెంట్ సొసైటీ' గుర్తించింది. ప్రమాదంలో హెలికాప్టర్ పూర్తిగా ధ్వంసమైందని, అందులో ఎవరూ బతికే అవకాశం లేదని తొలుత ప్రకటించారు. కాసేపటికే అధ్యక్షుడి మరణవార్తను ఇరాన్ మీడియా ధ్రువీకరించింది. హెలికాప్టర్ శకలాల దృశ్యాలను స్థానిక మీడియా పసారం చేసింది.

రైసీ 2017లో దేశాధ్యక్ష పదవికి పోటీ చేసి హసన్ రౌహానీ చేతిలో ఆయన పరాజయం పాలయ్యారు. 2019లో న్యాయ వ్యవస్థ అధిపతిగా బాధ్యతలు చేపట్టారు. రెండో ప్రయత్నంలో.. 2021లో దేశాధ్యక్షుడిగా ఆయన ఎన్నికయ్యారు. ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా ఖమేనీకి వారసుడిగా అందరూ రైసీని చూస్తుంటారు. తాను నమ్మిన సిద్ధాంతాలను ఎట్టిపరిస్థితుల్లోనూ విడనాడడని ఆయనకు పేరుంది. కాగా.. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఖమేనీ, రైసీల ఆదేశాలతో ఇజ్రాయెల్‌పై ఇరాన్ బలగాలు గత నెలలో డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడిన సంగతి గమనార్హం.

## ఘనంగా గ్రీన్ క్లబ్ దశాబ్ది వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** గ్రీన్ క్లబ్ అనకాపల్లి దశాబ్ది వేడుకలు స్థానిక గాంధీ నగరం లయన్స్ క్లబ్ హాల్లో అత్యంత ఘనంగా జరిగాయి గ్రీన్ క్లబ్ దశాబ్ది వేడుకల్లో భాగంగా హరిత వికాస్ ఫౌండేషన్ తునికి చెందిన పర్యావరణ వేత్త పాలుపర్తి దాలినాయుడు వరి కుంచెల శిక్షణ కార్యక్రమం గ్రీన్ క్లబ్లో 75 సంవత్సరాలు దాటిన దంపతులకు ఆత్మీయ సన్మానం ,పర్యావరణ హిత స్టాల్స్ ప్రదర్శన ,గ్రీన్ క్లబ్ మహిళలకు ఆటల పోటీలు, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ సేవకులు కర్రి సన్యాసినాయుడు సంస్థ గౌరవ అధ్యక్షుడు పెంటకోట ఉమామహేశ్వరరావు విశ్రాంత అటవీ శాఖ అధికారి బీర వినోద్ కుమార్, కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ) జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలు ప్రారంభించారు. సందర్భంగా వృక్షమిత్ర అవార్డు గ్రహీత సంస్థ వ్యవస్థాపకులు శ్రీధర్ మాట్లాడుతూ 2014 జూన్ 5వ తేదీన గ్రీన్ క్లబ్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థాపించడం జరిగిందన్నారు. కేవలం వంద రూపాయల సభ్యత్వంతో పది సంవత్సరాలు నెలకి ?100 సభ్యత్వం ప్రతి నెల జన భాగస్వామ్యంతో మొక్కలు నాటడం ఇంకుడు గుంతల నిర్వహణ పక్షులకు త్రాగునీరు గుళ్ళు ఏర్పాటు చేయడం వంటి కార్య క్రమాలు అనేకం నెరవేస్తూ వస్తున్న మన్నారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల విజేతులకు బహుమతి ప్రధానోత్సవం జరిగింది. కుంచం నూకయ్య శెట్టి దంపతులు ఎల్లపు సూర్య అప్పారావు దంపతులు గొరిపతి మాస్టర్ దంపతులు రాఘ వరావు దంపతులు కర్రీ హనుమంతరావు లకు సంస్థ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ సభ్యులు పర్యావరణ ప్రియులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ఆశయాలకు తూట్లు పొడుస్తున్న సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు,సిఐటీయు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, డిమాండ్ చేసారు.

ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం ఒక దినపత్రికలో వచ్చిన "సచివాలయానికి తాళాలు" అనే శీర్షిక చదవడం జరిగిందని ప్రభుత్వ కార్యాలయాలు పనిచేసే వేళల్లో ఆ కార్యాలయానికి తాళాలు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బెలగాం లోని ఎనిమిదవ సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది తీరు ప్రజలకు ఇబ్బందులను కలుగ చేస్తుందని,ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో కూడా ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసే సమయంలో ఆ సచివాలయ ప్రాంతానికి పర్యవేక్షణ నిమిత్తం సాక్షాత్తు మున్సిపల్ కమిషనర్ వెళ్ళినప్పుడు కూడా ఈ సచివాలయానికి తాళాలు వేసి ఉన్నప్పటికీ అటువంటి సిబ్బందిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. నాలుగు రోజులు గడవక ముందే శనివారం కూడా ఈ సచివాలయానికి పని సమయంలో తాళాలు వేసి ఉండటం చూస్తే ఆ సచివాలయ సిబ్బందికి ఉద్యోగంపట్ల అధికారుల ఆదేశాలపట్ల ప్రభుత్వ నిబంధనలపట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా ఈ సచివాలయం పై మున్సిపల్ కమిషనర్ శ్రద్ధ చూపించి ఆ సచివాలయం సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనియెడలఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటీయు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు ఉన్నారు.

## 24 నుండి ఇంటర్మీడియెట్ సప్లమెంటరీ పరీక్షలు

**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ఇంటర్మీడియెట్ పబ్లిక్ అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు మే 24వ తేదీ నుండి జూన్ 7వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా రెవిన్యూ అధికారి జి. కేశవ నాయుడు అన్నారు. ఇంటర్మీడియెట్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ సప్లమెంటరీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వాతావరణశాఖ వర్షాలు పడేఅవకాశం ఉందని హెచ్చరించినందున వర్షం వలన యిబ్బందులురాకుండా పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో 17 సెంటర్లలో పరీక్షలు జరుగుతాయని ఆయన చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో కనీస సౌకర్యాలు - 



తాగు నీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు రెండు పూటలా జరుగుతాయని ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం వారికి ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు , ఇంటర్మీడియెట్ రెండవసంత్సరం వారికి మధ్యాహ్నం 2.30 గంటలనుండి 5.30 గంటల వరకు జరుగుతాయని తదనుగుణంగా బస్సులు నడపాలని ఆయన చెప్పారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. పరీక్షల పేపర్లు నిర్దేశిత కేంద్రాలకు పంపించుటకు తగు ఏర్పాట్లు చేయాలని పోస్టల్ శాఖను కోరారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు పక్కాగా ఉండాలని పోలీసు శాఖకు సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ జిల్లా అదికారి డి. మంజుల వీణ , పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ ,ఆర్ టి సి, పోస్టల్, విద్యుత్ శాఖల అదికారులు పాల్గొన్నారు.

**పంచాంగం**

| | |
|---|---|
| మంగళవారం 21-05-2024 | |
| క్రోధి నామ సంవత్సరము | |
| ఉత్తరాయణం, వసంతరుతువు | |
| వైశాఖమాసం | |
| తిథి | : బ. త్రయోదశి సా. 04.27 |
| నక్షత్రం | : స్వాతి పూర్తి |
| వర్జ్యం | : ఉ. 11.21 ల 01.04 |

## సాయి విజ్కి సినిమా బ్యానర్ లో "అక్కడ వారు ఇక్కడ ఉన్నారు"



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సినిమా ఈ నెల 17న రిలీజ్ అయ్యింది. ఇందులో నటించిన వారు చాలా అద్భుతమైన నటనను ప్రదర్శించారు. వారి నటనకు, మరిన్ని అవకాశాలు రావాలని, చాలా మంది కొత్త వారు అయినా బాగా నటించడం, ఎంతో ఆనందాన్ని ఇవ్వటంతో పాటు ఈ సినిమా నిర్మాత, దర్శకులు, కుందుర్తి త్రివిక్రమరావు నటులకి, సన్మానం చేయాలి అనే ఉద్దేశ్యంతో ప్రతి నటి, నటులను సన్మానం చేశారు.

సీనియర్ నటి పంతుల లలితగారు అద్భుతమైన క్యారెక్టర్ ను ఇందులో చేసినందున వారిని వైజాగ్ చిత్రాలయ దియేటర్లో సన్మానం చేయటం జరిగింది.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** 33/11 కెవి ఎస్.రాయవరం సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి రేగుపాలెం ఫీడర్‌కు సంబంధించి లైన్ నిర్వహణ పనులు, మరమ్మత్తుల నిమిత్తం నేడు ఉదయం 7 గం.ల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు యలమంచిలి మండలంలో కృష్ణాపురం, కృష్ణాపురం కాలనీ, నాయనమ్మపాలెం, లక్కవరం, పోతిరెడ్డి పాలెం రుక్మిణి పురం జగనన్న కాలనీల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ అధికారి ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాజశేఖర్ సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేసే ప్రదేశాలలో అవకాశం ఉన్న చోట ప్రత్యామ్యాయంగా ఉదయం 5 గం.ల నుండి 7 గం.ల వరకు అలాగే మధ్యాహ్నం 1 గం.నుండి 6 గం.ల వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## విశాలాక్షినగర్‌లో సంకీర్తన శిక్షణ శిబిరం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** "అన్నమయ్య సంకీర్తన శిక్షణ శిబిరం" కొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో భక్త తుకారాం రామాలయం, విశాలాక్షి నగర్ లో 100 మంది తో కార్యక్రమం చాలా దిగ్విజంగా జరిగింది. ఈ శిక్షణా శిబిరం ఈనెల 24వ తారీఖు వరకు వుంటుంది...

అలాగే ఆలయం లో నూతనంగా ఏర్పాటు చేసిన వాగ్గేయ భక్త తుకారాం వారి విగ్రహం కొండవీటి జ్యోతిర్మయి గారి చేతులమీదుగా ఆవిష్కరణ జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ జయరాం గారు, ఆలయ జాయింట్ సెక్రటరీ సోమేష్ గారు, కమిటీ సభ్యులు అశోక్ బాబు,దుర్గా ప్రసాద్ పండా తదితరులు పాల్గొన్నారు.

## అల్లర్లు జరగకుండా పోలీసుల గ్రామసభలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణ ఆదేశాలతో 2024 సార్వత్రిక ఎన్నికల తరువాత గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా సంబంధిత పోలీసు అధికారులు మే 20న గ్రామసభలు నిర్వహించి గ్రామ పెద్దలు, ప్రజలతో మమేకమై, గ్రామాల్లో అందరూ వివాదాలకు దూరంగా ఉండాలని, శాంతియుతంగా మెలగాలని కోరారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మైక్ ద్వారా పోలీసులు ప్రచారం నిర్వహిస్తున్నారు.

విశాఖ సమాచారమ్
మంగళవారం 21-05-2024

## తపన

పూజలు, నోములు, వ్రతాలు, అర్చనలు, ఆరాధనలు, అభిషేకా లు, తీర్థయాత్రలు, దక్షిణలు, ప్రదక్షిణ లు, నామస్మరణలు యిలాంటి పనులన్నింటినీ మనం ఆధ్యాత్మికం అంటున్నాం. అనుకుంటున్నాం. ఇవేవీ కానివి, వీటికి సంబంధంలేని ఇతరత్రా పనులన్నిటినీ లౌకికమని అంటున్నాం. నిజానికి పూజలు, వ్రతాలు వంటివన్నీ ఆధ్యాత్మికానికి మనల్ని తీసుకువెళ్ళే మార్గాలు. సాధనా సరంజామాలు.

కానీ అవే అసలు సిసలైన 'ఆధ్యాత్మికం' అని అనలేం. 'నేను' అనే స్థాయి నుంచి విస్తృతమై, విశాలమై 'మనం' అనే స్థాయికి చేరుకునే ప్రయాణమే ఆధ్యాత్మికం. రాక్షసత్వం నుంచి పశు త్వానికి, పశుత్వం నుంచి మాన వత్వానికి, మానవత్వం నుంచి మాధవత్వానికి చేరుకోవటమే ఆధ్యాత్మికం. సంకుచిత్వం నుంచి సంయుక్త తత్వానికి, ఆటవికం నుంచి ఆత్మ తత్వానికి చేరుకోవటమే అసలు సిసలు ఆధ్యాత్మికం.

ఆధ్యాత్మికం అనేసరికి పూర్వ జన్మ సుకృతం, కర్మ ఫలం, ప్రాప్తం, అప్రాప్తం అనే మాటల్ని మనం తరచుగా వింటూ ఉంటాం. అన్నీ వాతంతట అవే అమరిపోయి అన్నీ చకచకా జరిగిపోతుంటే, 'ఆహా! అది వాడి ప్రాప్తం' అంటాం. అలా జరగక ఎదురు తిరిగితే ప్రాప్తం లేదంటాం. పూర్వజన్మ ఫలం అంటాం. కర్మ అనుభవించాలి అంటాం. అప్రాప్తం అని కూడా అంటాం.

ఆచార్య ఆత్రేయ అన్నట్టు "తలచింది జరిగిందంటే అంతా మన ప్రతిభ అనంటాం. తలచింది జరగని నాడు తలరాతం టూ విధిపై నెడతాం. అయితే భగవంతుడి అనుగ్రహం అనేది ఈ ప్రాప్తం, అప్రాప్తాలు, పూర్వజన్మలు, కర్మలు, సుకృతాల మీదే ఆధారపడి ఉండదు. మన సాధన మీద, మన ప్రయత్నం మీద, దీక్ష మీద, మనం ఉండే స్థితి మీద, పరిస్థితి మీద, మన సంసిద్ధత మీద ఆధారపడి ఉంటుంది.

ద్వాపర యుగంలో ఒకానొక సమయంలో శ్రీకృష్ణ పరమాత్మ తన ఇంటిలో నిద్రపోతున్నట్టు నటిస్తున్నాడు. కృష్ణుని పెదవులను అంటుకుని వేణువు దివ్యమైన వేణు గానాన్ని కృష్ణుడు వేణువును ఊదకుండానే వినిపిస్తోంది. వేణు గానం విన వస్తుంటే చుట్టుపక్కల అందరూ అక్కడికి చేరుకు న్నారు. వేణువు అదృష్టాన్ని అభినందించారు. వేణువును పొగ డ్తలతో ముంచెత్తారు. వేణువుకి అందరూ తనని పొగిడే తీరు కొంచెం అసౌకర్యంగా అనిపించింది. "నన్ను అలా పొగడ వద్దు. నాలో అహంకారం తలెత్తవచ్చు." అని వారించింది వేణువు.

కొంత సమయం గడిచిన తర్వాత కృష్ణయ్యకు ఎంతై నా వేణువు అంటే కొంచెం ఎక్కువ ఆపేక్ష అనీ, యిష్టమనీ, అది కృష్ణుని పక్షపాత బుద్ధికి నిదర్శనమనీ, కొందరి గుసగుసలు మెల్లగా వేణువు చెవిన పడ్డాయి.

అప్పుడు వేణువు యిలా అంది. "నా శరీరాన్ని చూడం డి. తొమ్మిది గుండ్రని రంధ్రాలతో, ఎంత గుల్లగా ఉందో! చూసేరా? బాగా గుల్లగా ఉంటూ ఆ నల్లనయ్య నాలో చాలా సులువుగా ప్రవేశించేలా నేను ఉన్నాను. ఉంటున్నాను. ఆ స్థితిలో నేను ఉండగలుగుతున్నాను. మరి మీరో? మీకూ నాలాగే నవ రంధ్రాలే ఉన్నాయి.

మీ నవరంధ్రాల నిండా కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలు, అహంకార మమ కార అసూయలను పూర్తిగా నింపుకుంటున్నారు. నల్లనయ్య తన అనుగ్రహంతో, మీలో చొరబడాలని ఎంత ప్రయత్నిం చినా, చొరబడ లేనంత స్థిరంగా ఉంటున్నారు. ఏమాత్రం గుల్లదనం లేకుండా, దృఢంగా మీ శరీరాలను ఉంచుకుంటు న్నారు. కృష్ణయ్య మీలో చొరబడటానికి అవకాశం ఏమాత్రం అ నల్లనయ్యకు ఈయడం లేదు. అలాంటప్పుడు మీలో ఆ కృష్ణయ్య దివ్యగానాన్ని ఏ రకంగా వినిపించగలడు?" అని అసలు రహస్యాన్ని వివరించింది వేణువు. అవును. భగవం తుడు సహవర్తి. సమవర్తి. అందరూ ఆయనకు సమానులే. ఆయనకు తరతమ బేధం అనేది ఏ కోసాన లేదు. సర్వులకూ సమస్త జీవులకూ తన అనుగ్రహాన్ని సమంగా అందించే తత్వం భగవంతునిది. భగవంతుడు తన అనుగ్రహాన్ని అం దరి మీద నిండుగా, దండిగా, మెండుగా కురిపించడానికి ఎల్ల ప్పుడూ సిద్ధంగానే ఉంటాడు. అయితే అందుకోడానికి మనం సంసిద్ధులమై ఉండాలి. మనసా, వాచా, కర్మణా, మనం సిద్ధ మై ఉండాలి. హృదయాన్ని తెరుచుకుని స్వచ్ఛంగా భగవం తుని కోసం మనం తయారై ఉండాలి. తపన పడాలి. తపిస్తూ ఉండాలి.

# పసిపిల్లలను పారవేయడంపై పాలన హక్కుల కమిషన్ ఆగ్రహం



**విజయనగరం:** విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ వారం రోజుల్లో ముగ్గురు శిశువులను వీధి కాలువల్లో, చెత్త కుండీలలో వేసి వారి బంగారు భవిష్యత్తు ను నాశనం చేయడం చాలా దురదృష్ట కరమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు.

ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ యువత కొన్ని ప్రత్యేక పరిస్థితులు వలన , దురలవాట్లు, చెడు స్నేహాలు వలన గర్భం దాల్చి , ప్రసవించి జన్మనిచ్చిన శిశువును తమ నుండి దూరం చేసుకోవడానికో, వదిలించుకోవడానికి దారుణంగా నిర్మానుష్యంగ ఉన్న ప్రదేశాలు, వీధి కాలువల్లో, పొదల్లో,చెత్త కుండీలలో వేయడం జరుగుతుందని తెలిపారు.

ఎవ్వరికైనా పిల్లల పెంపకం, పోషణ, రక్షణ, సంరక్షణ కోసము ఇబ్బందికర పరిస్థితులు తలెత్తినట్లు ఐతే ఏటువంటి శిశువులను ,బాలలను ప్రభుత్వ నియమ నిబంధనలు మేరకు వారి అధీనంలోకి తీసుకొని వారికి పూర్తి స్థాయిలో రక్షణ, సంరక్షణ కల్పించి మంచి బంగారు భవిష్యత్తు కల్పిస్తుందని తెలిపారు.

అంతేకాకుండా ఇటువంటి శిశువులు కోసము జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఆసుపత్రిలో ఊయల ను ఏర్పాటు చేయడం జరిగిందనీ, ఆ ఊయలలో ఇటువంటి శిశువులను వేసినట్టి అయితే ఆ లు శిశువులను ప్రభుత్వాధికారులు బాలల సంరక్షణ కేంద్రాలు లో ఉంచి దత్తత ఇవ్వడం జరుతుందని, వదిలి వేయబడిన వారి యొక్క వివరాలను కూడా గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

జరుగుతున్న ఇటువంటి దుర దృష్టకర సంఘటనలు నేపథ్యంలో స్థానికంగా ఉండే అంగన్వాడీ కార్య కర్తలు, ఆశా వర్కర్లు, సచివాలయం సిబ్బందికి గర్భిణీ స్త్రీలు గర్భం ధరించిన దగ్గర నుండి ప్రసవించి తమ స్వస్థలానికి చేయూకున్న అంతవరకు నిశితంగా పరిశీలించి నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.రాష్ట్రంలో వేల మంది కుటుంబాల్లో పిల్లలు లేక దత్తత కోసము దరఖాస్తు చేసుకొని ఎదురు చూస్తున్నారనీ, ఏటువంటి కు టుంబాలకి ఇటువంటి ఈ పిల్లలను వారికి దత్తత ఇచ్చి వారికి సహాయం చేసిన వారం అవుతామని తెలిపారు.

ఈ జరిగిన సంఘటనలు పై పోలీసు అధికారులు విచారణ చేపడుతున్నారని తెలిపారు.

మళ్ళీ పునరావృతం కాకుండా విస్తృతంగా గ్రామ స్థాయి నుండి అందరికీ అవగాహన కార్యక్రమాలను చేపట్టడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

# నిరు పేద వృద్ధులకు ఆర్థిక సహాయం అందజేత



**పార్వతీపురం/సీతానగరం, (విశాఖ సమాచారమ్):** అందుబాటులో ఉన్న పేదలకు వస్తు,వస్త్ర రూపంలో చేసే దానం కొంతలో కొంత ఆదుకుంటుందని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డా. టి. జగన్ మోహనరావు స్పష్టం చేశారు. సోమవారం ఆయన తన సోదరి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యరాలు డా. టి. హేమాక్షి తో కలిసి సీతానగరం మండలం బూర్జ గ్రామంలో నిరుపేదలకు తన తండ్రి తెర్లి. గౌరి నాయుడు (డెప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్) 18వ వర్ధంతి సందర్భంగా గొడుగులు,పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన తండ్రి వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఆనవాయితీగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,తన తండ్రి వృత్తిరీత్యా కుష్టు రోగులకు 25 సంవత్సరాలు సేవలందించారని వృత్తిలో ఉండగానే స్వర్గస్తులయ్యారని అన్నారు.వృత్తి లో,సేవా భావంలో ఆయన మాకెంతో స్ఫూర్తిదాయకమని అన్నారు.ప్రస్తుత ఎండ తీవ్రత దృష్ట్యా, రాబోయే వర్షా కాలం దృష్టిలో పెట్టుకుని గొడుగులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా సీజనల్ వ్యాదుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అక్కడ ప్రజలకు అవగాహన కల్పించారు. వారి తండ్రి గౌరినాయుడు ఆత్మ శాంతించాలని వారు ప్రార్థించారు.

# మూడంచెల భద్రతతో ఈ వి ఎం ల భద్రత

## స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర గస్తీ



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు స్థానిక డిగ్రీ కళాశాలలో అరకు పార్లమెంట్ ఈ వి ఎం లను మూడంచెల భద్రత తో జాతీయ ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ అరకు పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ఆదేశాలు తో నిరంతర గస్తీ మధ్య ఈ వి ఎం లను భద్ర పరుస్తున్నారు అని బీజేపీ అరకు పార్లమెంట్ కొత్తపల్లి గీత రిప్రజెంటేవ్ రవికుమార్ పెనుమాక అన్నారు. సోమవారం ఉదయం పాడేరు డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్ శర్మ తో కలసి స్ట్రాంగ్ రూమ్ లను పరిశీలించారు, ఈ సందర్భంగా రవికుమార్ పెనుమాక మాట్లాడుతూ పాడేరు డిగ్రీ కళాశాల లో భద్రత చేసిని ఈ వి ఎం ల భద్రత పట్ల పార్లమెంట్ స్ట్రాంగ్ రూముల మూడంచెల భద్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరుగుటకు సహకరించిన జిల్లా ఎలక్షన్ అధికారి వారికి, రిటర్నింగ్ అధికారి వారికి ఏఎస్ఆర్ జిల్లా ఎస్పీ కి పాడేరు పోలీసులు కు ఈ సందర్భంగా రవికుమార్ పెనుమాక కృతజ్ఞతలు తెలియజేశారు. జూన్ 4వ తారీఖున జరుగబోవు కౌంటింగ్ ప్రక్రియ వరకు మూడంచెల భద్రత కొనసాగుతుందని పాడేరు డిప్యూటీ కలెక్టర్ వివిఎస్ శర్మ తెలిపారు.

# కౌంటింగ్ రోజున అప్రమత్తంగా ఉండాలంటూ ప్రచారం



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వచ్చే నెల జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు పోలీస్ శాఖ ఇప్పటి నుంచే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా యలమంచిలి పట్టణ పోలీసు కెల్లా పాపినాయుడు ఆధ్వర్యంలో సోమవారం నాడు తన సిబ్బందిచే పట్టణ వ్యాప్తంగా మైక్ ద్వారా ప్రచారాన్ని నిర్వహించారు.

# స్ట్రాంగ్ రూం తనిఖీ చేసిన రిటర్నింగ్ అధికారి



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను అరకు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ సోమవారం తనిఖీ చేసారు. అరకు అసెంబ్లీ నియోజక వర్గం, ఇవి ఎం లను భద్రపరిచిన గదులను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమరాలు సక్రమంగా నిరంతరం పని చేసేలా చూడాలని ఆదేశించారు. గదులకు వేసిన సీళ్లను పరిశీలించారు.భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇతరులు డిగ్రీ కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశించకుండా నియంత్రించాలని ఆదేశించారు. అనంతరం లాగ్ బుక్ లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# మీడియాపై అక్రమ కేసులు ఉపసంహరించండి

**విజయవాడ:** బాధితుల గొంతు విని పించిన మీడియాపై విశాఖపట్నం పోలీసులు అమానుషంగా దాడి చేశారంటూ మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమా మహేశ్వరరావు మండిపడ్డారు. తప్పుడు కేసులు పెట్టినవాళ్ళు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కంచరపాలెం పోలీసుల తీరును దేశమంతా చూస్తోందని తెలిపారు.

తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలతో సీఎస్ నేతృత్వంలో కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. సజ్జల, జగన్ సూచనలతోనే మీడియాపై అక్రమ కేసులు పెట్టారంటూ దేవినేని దుయ్యబట్టారు. అక్రమ కేసులు బనాయిస్తున్న సీఎస్ వ్యవహారశైలిని ఈసీ కట్టడి చేయాలన్నారు. మీడియాపై పెట్టిన కేసులు తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు.

పోలింగ్ తర్వాత చోటుచేసుకున్న హిం సపై సిట్ దర్యాప్తు కూడా పారదర్శకంగా జర గాలని తెలిపారు. హింసపై తమ కాల్‌డేటా బయటపెట్టేందుకు సిద్ధమన్నారు. వైసీపీ నేతలు కాల్‌డేటా బహిర్గతం చేయగలరా? అని ప్రశ్నించారు. ఉన్నతాధికారుల తప్పి దాలకు కిందిస్థాయి ఉద్యోగులు బలయ్యారని దేవినేని ఉమా ధ్వజమెత్తారు.

# భీమిలిలో బీజేపీకి సమాధి కడుతున్న నాయకులు

## సమన్వయకర్త ఒంటెత్తు పోకడలు, అవగాహన రాహిత్యమే కారణమంటున్న కార్యకర్తలు

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** అటు కేంద్రం లో బీజేపీ ఎదురేలేని శక్తిగా ఎదిగి తద్వారా రాష్ట్రం లో కూడా ఆ పార్టీ పురోగతి సాధిస్తున్న సమయం లో భీమిలి లో మాత్రం ఆ పార్టీ ఉనికిని కోల్పువుతున్నదని పార్టీ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. గతం లో పాత నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో ఆ పార్టీ భీమిలి నియోజక వర్గంలో అనేక పోరాటాలు చేసి ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ పార్టీ ని అభివృద్ధి దిశలో పెట్టిన నిబద్ధత గల నాయకులు నేడు కరువయ్యారు. అయితే గతంలో పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలు నేటికీ కూడా పార్టీ ని అంటిపెట్టుకొనే ఉండడం గమనార్హం. రాను రాను రాష్ట్రం లోను జిల్లా లోను కూడా పార్టీలో అనేక మార్పులు సంభవించాయి. ఆ తరుణం లో భీమిలి నియోజకవర్గం కూడా కొత్త నాయకత్వం వచ్చింది. అయితే నేడు ఆ పార్టీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పురోగతి సాధించడం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. దీనికి కారణం పార్టీ సమన్వయకర్త పార్టీ కి అన్నీ తానే అన్న భావన,అనుభవ లేమి , అవగాహన రాహిత్యమే అని కార్యకర్తలు అంటున్నారు.





ఆయన ఒంటెత్తు పోకడలతో తాను అనుకొన్నదే నిజం అనే భావనతో పార్టీసరిగ్గా ని నడిపించలేక పోతున్నారని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. నియోజక వర్గ సమన్వయ కర్త నియోజకవర్గం లో అందరిని కలుపుకొంటూ,తరుచు సమావేశాలు నిర్వహించి కార్యకర్తలకు ఉత్సాహం నింపవలసింది పోయి కేవలం తనకు అనుకూలమైన కొద్దిమంది నాయకులతో మాత్రమే సమావేశాలు నిర్వహించి పార్టీ లో గతం లో పనిచేసిన నాయకులను, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని కార్యకర్తలు అంటున్నారు. రాష్ట్రం లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ లు కూటమి గా ఏర్పడిన తరువాత ఆ పార్టీ ని మరింత అభివృద్ధి చేయవలసింది పోయి సమన్వయకర్త అంతా తన ఇష్టానుసారం పార్టీ ని నడిపిస్తున్నారని, కూటమి అభ్యర్థి ప్రచారం విషయం లో గాని అభ్యర్థి న నామినేషన్ కార్యక్రమం విషయం లో గాని కొద్దిమంది నాయకులను, కార్యర్తలకు సమాచారం ఇచ్చి మిగతా వారిని పక్కన పెట్టడం ఏమిటని నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు మండి పడుతున్నారు. అలాగే నియోజకవర్గం లో మండల స్థాయిలో పార్టీ నాయకత్వాలు కూడా సరిగ్గా పనిచేయడం లేదు. తగరపువలస శాఖ అయితే ఉన్నదా లేదా అని కార్యకర్తలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ సమావేశాలు ఎలాగూ నిర్వహించడం లేదు సరికదా కనీసం పార్టీ సీనియర్ నాయకులు,మాజీ ప్రధాని వాజ్ పేయి జయంతి వేడుకలు కూడా జరుపలేదంటే సదరు నాయకులకు నిజం గా పార్టీ పట్ల చిత్తశుద్ధి ఉందా అని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. అటువంటప్పుడు ఏమి ఆశిస్తూ పార్టీని అంటిపెట్టుకొని ఉంటున్నారని గతం లో పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు అన్నీ తెలుస్తున్నా జిల్లా నాయకత్వం కూడా సరిగ్గా స్పందించడం లేదని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

**భీమిలిలో పార్టీ ప్రక్షాలన జరగాలి:** అటు కేంద్రం లో దూసుకొని పోతూ ఇటు రాష్ట్రం లో పార్టీ అభివృద్ధి చెందుతున్న తరుణం లో పార్టీ అధినాయకత్వం భీమిలి నియోజకవర్గం లో పార్టీ ని ప్రక్షాలన చేయాలని పలువురు కార్యకర్తలు కోరుతున్నారు. ఒంటెత్తు పోకడలు లేకుండా, అన్నీ తానే అని భావిస్తున్న నాయకులను కాకుండా పార్టీ అభివృద్ధి కోసం నాయకులను, కార్యకర్తలను కలుపుకొంటూ పోతూ తరుచు సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ పట్ల అంకితభావం , నిబద్ధత తో కృషి చేసే పాత, కొత్త నాయకుల కలయికతో కొత్త నాయకత్వాన్ని నియమించి తద్వారా రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధి చెందేలా పార్టీ అధినాయకత్వం కృషి చేయాలని పార్టీ కార్యకర్తలు కోరుతున్నారు.

# దానిమ్మ వల్ల ప్రయోజనాలు



మన హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి మన అహారాన్ని పర్యవేక్షించడం చాలా ముఖ్యం. మన వయస్సు పెరిగే కొద్దీ మంచి హృదయ ఆరోగ్యం చాలా ముఖ్యమైనది.

మన హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి మన ఆహారాన్ని పర్యవేక్షించడం చాలా ముఖ్యం. మన వయస్సు పెరిగే కొద్దీ మంచి హృదయ ఆరోగ్యం చాలా ముఖ్యమైనది. గుండె సమస్యలతో బాధపడేవారు రోజుకు మూడు దానిమ్మలను తినాలి, ఎందుకంటే అవి గుండెకు చాలా ముఖ్యమైన ప్రయోజనాలను అందిస్తాయి.

గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు 1 దానిమ్మ పండు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. దాని పూర్తి ప్రయోజనాలను పొందాలంటే, ఆహారం మరియు జీవనశైలిలో సర్దుబాట్లు అలాగే ఇతర జీవనశైలి మార్పులను చేయాలి.

**దానిమ్మ రసం** : గ్రీన్ టీ లేదా రెడ్ వైన్ కంటే దానిమ్మ రసంలో దాదాపు మూడు రెట్లు ఎక్కువ యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. దానిమ్మ రసంలోని పాలీఫెనాల్స్ యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్ అని కూడా పిలువబడే తక్కువ-సాంద్రత కలిగిన ప్రోటీన్ (LDL)ని తగ్గించడంతో పాటు అనేక గుండె ప్రయోజనాలను అందిస్తాయి. ముదురు ఎరుపు రంగుతో, దానిమ్మ రసం చూడటానికి అందంగా ఉండటమే కాకుండా, ఇతర రసాల కంటే ఎక్కువ యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది. అరకప్పు దానిమ్మపండులో 80 కేలరీలు, 16 గ్రాముల కార్బోహైడ్రేట్లు మరియు మూడు గ్రాముల ఫైబర్ ఉంటాయి. దానిమ్మలో ఫోలేట్, పొటాషియం మరియు విటమిన్ కె వంటి అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి.

**గుండె ఆరోగ్యం:** దానిమ్మ ధమనులను శుభ్రపరచడానికి, రక్తపోటును తగ్గించడానికి మరియు రక్త నాళాలలో అడ్డంకులు ఏర్పడకుండా నిరోధించడానికి సహాయపడుతుంది, తద్వారా మంచి గుండె ఆరోగ్యానికి దోహదపడుతుంది.

**రక్తాన్ని పలుచగా చేస్తుంది** : దానిమ్మలోని యాంటీ ఆక్సిడెంట్లు 'మీ రక్తాన్ని పలచబరచడానికి' సహాయపడతాయి. దానిమ్మ గింజలు మీ బ్లడ్ ప్లేట్‌లెట్స్ గడ్డకట్టకుండా నిరోధిస్తాయి.

రక్తం గడ్డకట్టడంలో రెండు రకాలు ఉన్నాయి, మొదటిది కోత లేదా గాయం నుండి కోలుకోవడం వేగవంతం కాదు మరియు రెండవది గుండె, ధమనులు లేదా శరీరంలో ఎక్కడైనా అంతర్గతంగా గడ్డకట్టడం. ఈ రకమైన కణితులు నిరపాయమైనవి కావు మరియు ప్రాణాంతకం కావచ్చు.

**ధమనుల అడ్డంకులను తొలగిస్తుంది** : మన వయస్సులో, మనం జీవిస్తున్న జీవనశైలి వల్ల మన ధమనుల గోడలు గట్టిపడతాయి మరియు కొన్నిసార్లు కొలెస్ట్రాల్ కారణంగా నిరోధించబడతాయి. దానిమ్మలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు చెడు కొలెస్ట్రాల్ ఆక్సీకరణను నివారిస్తాయి. కాబట్టి దానిమ్మపండు తినడం వల్ల అదనపు కొలెస్ట్రాల్ తొలగిపోతుంది మరియు ధమని గోడలు గట్టిపడకుండా చేస్తుంది.

**ఆక్సిజన్ మాస్క్** : దానిమ్మ మన రక్తంలో ఆక్సిజన్ స్థాయిని పెంచడానికి సహాయపడుతుంది. దానిమ్మలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి, కొలెస్ట్రాల్‌ను తగ్గించి రక్తం గడ్డకట్టడాన్ని నివారిస్తాయి. ఇవన్నీ అంతిమంగా రక్తాన్ని శరీరమంతా ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రవహించటానికి సహాయపడతాయి.

# ఆల్కహాల్ తాగడం వల్ల ప్రమాదాలు!



ఈ రోజుల్లో మద్యం తాగే వారి సంఖ్య ప్రమాదకర స్థాయిలో పెరిగిపోతోంది. మద్యం సేవించడం ప్రమాదకరమని తెలిసినా ఆ తప్పు చేస్తున్నారు. మద్యము సేవించడం మీ శరీరముపై తీవ్రమైన హానిని కలిగించవచ్చు. ఎక్కువసేపు మద్యం సేవించడం లేదా ఒకేసారి ఎక్కువగా తాగడం మీ ఆరోగ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది.

మీ గుండె నుండి మీ కడుపు వరకు, మద్యం సేవించడం స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక ప్రభావాలను కలిగి ఉంటుంది. అందుకే మీ ఆల్కహాల్ వినియోగాన్ని తగ్గించడం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలికి మారడం చాలా ముఖ్యం.

**జీర్ణ రుగ్మతలు** : అతిగా మద్యం సేవించడం వల్ల మీ జీర్ణవ్యవస్థ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఇది మీ ప్రేగులు ఆహారాన్ని జీర్ణం చేయకుండా మరియు పోషకాలు మరియు విటమిన్లను గ్రహించకుండా నిరోధిస్తుంది. అలాగే, అతిగా తాగడం వల్ల గ్యాస్, ఉబ్బరం, విరేచనాలు మరియు పొత్తికడుపు నిండుగా ఉంటుంది. ఆల్కహాల్ కడుపు యొక్క లైనింగ్‌ను చికాకుపెడుతుంది, దీని వలన అదనపు యాసిడ్ ఏర్పడటం మరియు చేరడం జరుగుతుంది. ఈ దీర్ఘకాలిక మంట కడుపు పూతలకి దారితీస్తుంది, ఇది అంతర్గత రక్తస్రావం కలిగిస్తుంది.

**అధిక రక్త పోటు** : రక్త నాళాల గోడలపై రక్తం యొక్క శక్తి నిరంతరం ఎక్కువగా ఉన్నప్పుడు అధిక రక్తపోటు ఏర్పడుతుంది. ఆల్కహాల్ అధిక రక్తపోటుతో సహా గుండె సంబంధిత సమస్యలతో ముడిపడి ఉంటుంది. మితిమీరిన మద్యపానం రక్తనాళాల్లోని కండరాలను ప్రభావితం చేస్తుంది, తద్వారా అవి ఇరుకైనవి మరియు వాటిని మరింత దెబ్బతీస్తాయి. ఒకేసారి మూడు కంటే ఎక్కువ పానీయాలు తీసుకోవడం వల్ల తాత్కాలికంగా రక్తపోటు పెరుగుతుంది, అయితే పదేపదే ఆల్కహాల్ తీసుకోవడం రక్తపోటులో దీర్ఘకాలిక పెరుగుదలకు దారితీస్తుంది.

**కాలేయం దెబ్బతింటుంది:** ఆల్కహాల్ తీసుకోవడం వల్ల శరీరంలో ఎక్కువగా ప్రభావితమయ్యే అవయవం కాలేయం. మద్యం సేవించిన తర్వాత, అది కడుపులో శోషించబడుతుంది. ఇది మీ రక్తప్రవాహంలోకి వెళ్లి కాలేయంలోకి ప్రవేశిస్తుంది. మీ కాలేయం ఆల్కహాల్‌ను విచ్ఛిన్నం చేయడానికి ఎంజైమ్‌లను విడుదల చేసే అతిపెద్ద అంతర్గత అవయవం. అయినప్పటికీ, ఒక సమయంలో లేదా ఎక్కువ కాలం పాటు ఎక్కువ ఆల్కహాల్ తాగడం ఆల్కహాల్ జీవక్రియను కష్టతరం చేస్తుంది. ఇది శరీరంలో అధిక ప్రసరణను వదిలి కొవ్వు కాలేయానికి కారణమవుతుంది. ఇది ఆల్కహాల్-సంబంధిత కాలేయ వ్యాధితో సంబంధం కలిగి ఉంటుంది, ఇది అధిక ఆల్కహాల్ వినియోగం వల్ల కలిగే కాలేయ నష్టాన్ని సూచిస్తుంది.

**నరాల సమస్యలు** : ఏకాగ్రత, శ్రద్ధ, మానసిక స్థితి మరియు ప్రతిచర్యలతో సహా అనేక విధులకు బాధ్యత వహించే మెదడులోని రసాయనాలను ఆల్కహాల్ నెమ్మదిస్తుందని నిపుణులు నమ్ముతారు. ఆల్కహాల్ మెదడు యొక్క కమ్యూనికేషన్ మార్గాలతో జోక్యం చేసుకుంటుంది మరియు మెదడు కనిపించే మరియు పని చేసే విధానాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేసే మార్గాల్లో అస్పష్టమైన ప్రసంగం వంటి సంక్లిష్ట లక్షణాలకు దారి తీస్తుంది. మీ పాదాలు మరియు చేతుల్లో తిమ్మిరి మరియు జలదరింపు మరియు జ్ఞాపకశక్తి సమస్యలు భావోద్వేగాలను నియంత్రించలేకపోవడం వంటి దీర్ఘకాలిక సమస్యలకు దారితీయవచ్చు.

**ఆల్కహాల్ ప్యాంక్రియాస్‌ను ఎలా రక్షిస్తుంది** : అధిక ఆల్కహాల్ తీసుకోవడం వల్ల ప్యాంక్రియాస్ దెబ్బతింటుంది, ఫలితంగా ప్యాంక్రియాటైటిస్ వస్తుంది. ప్యాంక్రియాస్ అనేది జీర్ణ ఎంజైమ్‌లు మరియు హార్మోన్లను ఉత్పత్తి చేసే ఒక అవయవం, ఇది మీ శరీరం చక్కెరను (గ్లూకోజ్) ప్రాసెస్ చేసే విధానాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది, మాయో క్లినిక్ వివరిస్తుంది. ప్యాంక్రియాస్‌లో దీర్ఘకాలిక మంట కూడా ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది.

# రోజూ రాగి అంబలి డైట్‌లో ఉంటే లెక్కలేనన్ని లాభాలు, మధుమేహానికి చెక్



ఇటీవలి కాలంలో అందరికీ హెల్త్ కాన్సెస్ పెరిగింది. వివిధ రకాల ప్రకృతి వైద్య పద్ధతులని మళ్లీ ఆశ్రయిస్తున్నారు. పాతకాలం నాటి ధాన్యాల్ని తిరిగి డైట్‌లో భాగంగా చేసుకుంటున్నారు. పాతతరం తృణ ధాన్యాల్లో రాగులు, జొన్నలు, సజ్జలు అతి ముఖ్యమైనవి. ఇందులో ఇవాళ మనం తెలుసుకునేది రాగుల గురించి.

రాగులు పాతతరమైనా ఇప్పటికీ వాడుకలో ఉంది. కర్ణాటక, రాయలసీమ ప్రాంతాల్లో రాగుల ఉపయోగం ఇప్పటికీ రాగి సంకటి, రాగి ముద్ద రూపంలో ఉంది. లేదా రోజూ వాకింగ్ లేదా వ్యాయామం పూర్తయ్యాక రాగి జావ తాగడం అలవాటుగా మారుతోంది. మొత్తానికి రాగులతో కలిగే ఆరోగ్య ప్రయోజనాల పట్ల అందరిలో అవగాహన పెరుగుతోంది. రాగి సంకటి, రాగి ముద్ద లేదా రాగి అంబలి తాగడం వల్ల శరీరంలో వేడి తగ్గడమే కాకుండా శరీరానికి ఇన్‌స్టంట్ ఎనర్జీ లభిస్తుంది.

రాగుల్లో ఉండే ఎన్నో రకాల ప్రోటీన్లు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రాగి అంబలి రోజూ తాగే అలవాటుంటే ఇం దులో ఉండే ఫైబర్, గ్లైసీమి యాతో బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో ఉంటాయి. శరీరంలో ఇన్సులిన్ నిల్వల్ని పెంచుతుంది. మరోవైపు ఇందులో ఉండే మినరల్స్ , పొటాషియం, ఫాస్ఫరస్, ఐరన్ కారణంగా రక్తంలో హిమోగ్లోబిన్ పెరుగుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కేన్సర్ కారకాల్ని, ఫ్రీ రాడికల్స్‌ను నాశనం చేస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటంతో ఏజీయింగ్ ప్రక్రియను అరికడుతుంది.

ఇందులో ఉండే మెగ్నీషియం, పొటాషియం వల్ల గుండె సంబంధిత వ్యాదులు తగ్గుతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులో పెద్దమొత్తంలో ఉండే అమైనో యాసిడ్స్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ని అరికడతాయి. ఎముకల సంబంధిత సమస్యలుండేవారికి రాగులు చాలా బలవర్ధకమైన ఆహారం. ఎందుకంటే ఇందులో కాల్షియం అదిక మొత్తంలో ఉంటుంది.

# అన్ని పండ్లు ఆరోగ్యానికి మంచివి కావా



శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో పండ్లు కీలకంగా ఉపయోగ పడతాయి. అందుకే ఏ వైద్యుడైనా సరే రోజూ పండ్లు తినమని సూచిస్తుంటారు. ఒక్కొక్క ఫ్రూట్‌లో ఒక్కో రకమైన పోషకాలు నిండి ఉంటాయి. పండ్లను చాలా సందర్భాల్లో కంప్లీట్ ఫుడ్ అని కూడా అభివర్ణిస్తారు. అయితే కొన్ని రకాల పండ్లను మాత్రం ఉదయం వేళ తినకూడదంటున్నారు వైద్యులు. ఆశ్యర్యంగా ఉందా..


పండ్లు ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు చాలా వరకూ ఉంటాయి. వీటికి తోడు సీజనల్ ఫ్రూట్స్ ఆరోగ్యానికి ఇంకా ప్రయోజనకరం. అందుకే సీజనల్ ఫ్రూట్స్ ఎప్పుడూ మిస్ కాకూడదంటారు. పండ్లు ఆరోగ్యానికి మంచివి కదా అనే కారణంగా చాలామంది ఉదయం పరగడుపున ఫ్రూట్స్ తింటుంటారు. కానీ కొన్ని రకాల పండ్లు ఉదయం వేళ పరగడుపున అస్సలు తినకూడదు. ఏయే పండ్లు పరగడుపున తిన కూడదు, తింటే ఏమౌతుందో తెలుసుకుందాం..

వాస్తవానికి యాపిల్ ఎ డే కీప్ డాక్టర్ ఎవే అంటారు. ఆపిల్ అంత అద్భుతమైన పండు. కానీ ఇందులో ఉండే ఎసిడిక్ కంటెంట్ కారణంగా ఉదయం పరగడుపున తింటే కడుపు లైనింగ్‌పై ప్రభావం చూపిస్తాయి. ఫలితంగా అజీర్తి సమస్య ఉత్పన్నమౌతుంది. పండ్లు అన్నింటిలో అద్భుతమైందిగా భావించే బొప్పాయి కూడా పరగగడుపున తింటే కడుపు పాడవుతుంది. ఇక ఫైబర్ ఎక్కువగా ఉండే బెర్రీస్ ఆరోగ్యానికి మంచివి. కానీ పరగడుపున తినడం వల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు రావచ్చు.

సిట్రస్ జాతి పండ్లుగా పిలిచే నారింజ, బత్తాయి, నిమ్మ, ద్రాక్ష పండ్లను పరగడుపున తినడం వల్ల గుండెలో మంట, వికారం, వాంతులు వంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమౌతాయి. అరటి పండును సాధారణంగా సూపర్ ఫుడ్‌గా పిలుస్తారు. ప్రొటీన్ల పరంగా అంత మంచిది. కానీ ఇందులో ఫైబర్ వల్ల పరగడుపున తింటే అజీర్తి సమస్య ఏర్పడుతుంది. ఫైబర్ అనేది కడుపులో ఉండే యాసిడ్‌తో కలిసి గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలకు కారణమౌతుంది. అరటి పండ్లను అతిగా కూడా తీసుకోకూడదు.

టొమాటోల్లో ఎసిడిక్ కంటెంట్ ఎక్కువ. అందుకే పరగడుపువ వీటిని తినకూడదు. స్టమక్ లైనింగ్ దెబ్బతింటుంది. గుండెలో మంట, యాసిడ్ రిఫ్లక్స్ సమస్యలు ఏర్పడతాయి. కడుపులోని యాసిడ్ కాస్తా అన్నవాహికలో చేరితే ఛాతిలో మంట ఏర్పడుతుంది.

# మీ శరీరంలో ఈ మార్పులు కన్పిస్తే, కిడ్నీ వ్యాధి కావచ్చు



ఇటీవలి కాలంలో కిడ్నీ సమస్యలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. కారణం వివిధ రకాల ఆహారపు అలవాట్లు, డయాబెటిస్, కొలెస్ట్రాల్ వంటి వ్యాధులు. కిడ్నీలు ఆరోగ్యంగా లేకపోతే మొత్తం శరీరంపై ఆ ప్రభావం పడుతుంటుంది. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకర స్థాయికి దారి తీస్తుంది. కిడ్నీలో సమస్య ఉంటే అసలు ఎలా తెలుస్తుంది..

రోజూ మనం తినే ఆహారం జీర్ణమయ్యేటప్పుడు వివిధ రకాల వ్యర్ధాలు, రసాయనాలు విడుదలవుతుంటాయి. వీటిని ఎప్పటికప్పుడు శరీరం నుంచి బయటకు తొలగించడం అవసరం. ఈ పని చేసేది కిడ్నీలే. అంటే కిడ్నీలు ఫిల్టర్ లా పనిచేస్తాయి. వ్యర్ధాల్ని ఫిల్టర్ చేసి మూత్రం ద్వారా బయటకు పంపిస్తుంది. రోజూ అదే పనిగా జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్, ఆయిలీ ఫుడ్స్ తినడంతో పాటు మద్యపానం, ధూమపానం వంటి చెడు అలవాట్ల కారణంగా మూత్రపిండాలపై అదనపు ఒత్తిడి పడుతుంది. జంక్ ఫుడ్స్ ను కిడ్నీలు కూడా సరిగ్గా ఫిల్టర్ చేయలేవు. దాంతో కిడ్నీల ఆరోగ్యం దెబ్బతింటుంది. ఈ పరిస్థితి ఒకేసారి జరగదు. క్రమ క్రమంగా జరుగుతుంది కాబట్టి కిడ్నీలో సమస్య తలెత్తిందనే విషయం కూడా మనకు తెలియదు. దాంతో పరిస్థితి ప్రమాదకరమైనప్పుడు చేతులెత్తేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే కిడ్నీలో సమస్య ఏర్పడినప్పుడు శరీరంలో కొన్ని మార్పులు సంభవిస్తాయంటున్నారు వైద్యులు. ఈ మార్పుల్ని మీరు గుర్తించగలిగితే కిడ్నీలో సమస్య ఉందని అర్ధం చేసుకోవచ్చు.

ఎప్పుడైతే కిడ్నీలు వ్యర్ధాల్ని సరిగ్గా ఫిల్టర్ చేయలేవో అప్పుడా వ్యర్ధాలు చర్మం కిందపేరుకుపోతాయి. దాంతో చర్మంలో దద్దుర్లు, దురద మొదలవుతుంది. ఇది కిడ్నీ సమస్యకు సంకేతమే. ఊపిరి సరిగ్గా ఆడకపోవడం కూడా ఓ లక్షణమే. వ్యర్ధాల్ని సరిగ్గా తొలగించకపోతే ఊపిరితిత్తుల్లో చేరి శ్వాసకు ఇబ్బందిగా మారతాయి. ఊపిరితిత్తుల్లో స్వెల్లింగ్ రావచ్చు.

కిడ్నీల్లో సమస్య ఉంటే మొదటి మార్పు లేదా సంకేతం మూత్ర విసర్జనతోనే కన్పిస్తుంది. ఎందుకంటే కిడ్నీల సంబంధం నేరుగా మూత్రంతోనే ఉంటుంది. కిడ్నీలే మూత్రాన్ని తయారుచేసి బయటకు పంపిస్తాయి. కిడ్నీల్లో సమస్య ఏర్పడినప్పుడు మూత్రం సరిగ్గా రాదు. లేదా మూత్రం రంగు మారవచ్చు లేదా మూత్రం పోసేటప్పుడు మంట, నొప్పి ఉండవచ్చు. ఈ సంకేతాలు నిస్సందేహంగా కిడ్నీ సమస్య లక్షణాలే.

కిడ్నీల్లో సమస్య ఉంటే కాలి పాదాల్లో వాపు కచ్చితంగా కన్పిస్తుంది. ఎందుకంటే కిడ్నీలు సరిగ్గా పనిచేయకపోతే హిమోగ్లోబిన్ తగ్గి ఆ ప్రభావం పాదాలపై కన్పిస్తుంది. మీకు తరచూ ఆకలి వేయకపోవడం ఉంటే అది కిడ్నీ సమస్యకు లక్షణం కావచ్చు. వ్యర్ధ పదార్ధాలు కడుపులో ఉండిపోయి ఆకలి వేయదు. కిడ్నీల్లో సమస్య ఉంటే వ్యర్ధ పదార్ధాలు లేదా విష రసాయనాలు మెదడుకు సైతం చేరుకుంటాయి. దాంతో ఏకాగ్రత తగ్గుతుంది. మూర్ఛ రోగం కూడా రావచ్చు.

# ముఖంపై అప్పుడప్పుడు వాపు వస్తోందా?



ముఖం అప్పుడప్పుడు వాచినట్లుగా అనిపిస్తోందా? ఆ వాపు ఎక్కువ సమయం ఉంటుందా? అయితే, జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే.. ఇది అనారోగ్యానికి అలారం బెల్ లాంటిందని చెబుతున్నారు. చర్మవ్యాధి నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ముఖం వాయడానికి ప్రధానంగా మూడు కారణాలు ఉండవచ్చు. కొన్నిసార్లు నిద్ర నుండి మేల్కొన్న తర్వాత వాపు కొంత సమయం వరకు ఉంటుంది. నిద్రపోతున్నప్పుడు ముఖంపై ద్రవం పేరుకుపోవడం వలన ఇది జరుగుతుంది. బోర్లా పడుకునే వారి ముఖంలో ఈ వాపు సర్వసాధారణం. కానీ, వాపు ఎక్కువ సమయం ఇలాగే ఉంటే మాత్రం దానికి కొన్ని ఇతర కారణాలు ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. మరి ముఖం వాపునకు కారణాలేంటి? దాని నివారణకు మార్గాలేంటి?

ముఖం మీద వాపు రావడానికి 3 ప్రధాన కారణాలు..

1. **చర్మ అలెర్జీ** : చెడు ఆహారం వల్ల అలర్జీ రావచ్చు. దీని కారణంగా ముఖం మీద వాపు ఏర్పడుతుంది. దుమ్ము, దూళి పడటం, పెంపుడు జంతువుల చర్మం లేదా కొన్ని ఆహారాలు, కీటకాల కాటు వల్ల అలర్జీలు రావచ్చు. అలర్జీల వల్ల సైనస్‌లు కుచించుకుపోయి ముఖం ఉబ్బిపోవచ్చు.

2. **చర్మం స్థితిస్థాపకత కోల్పోవడం:** చర్మం స్థితిస్థాపకత కోల్పోవడం వల్ల కూడా ముఖం మీద వాపు వస్తుంది. పెరుగుతున్న వయస్సుతో, చర్మం స్థితిస్థాపకత తగ్గుతుంది, దీని కారణంగా రాత్రి సమయంలో ద్రవం పేరుకుపోతుంది. ముఖం మీద వాపు పెరుగుతుంది. దాన్ని ఆపడం కష్టం. ఎందు కంటే వయసు పెరిగే కొద్దీ చర్మం వదులుగా మారుతుంది. అయితే, చర్మం సహజ కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడం ద్వారా కొంతవరకు చర్మాన్ని మృదువుగా చేయవచ్చు.

3. **అధిక ఉప్పు, మద్యం వినియోగం:** ఆల్కహాల్, ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా ముఖం మీద వాపు వస్తుంది. చాలా సార్లు ఈ సమస్య సోడియం ఉన్న ఆహారాల వల్ల వస్తుంది. ముఖం మీద వాపు కూడా డీహైడ్రేషన్‌కు సంకేతం. ముఖ్యంగా మీరు ఉప్పు, ఆల్కహాల్ ఎక్కువగా తీసుకున్నప్పుడు. డీహైడ్రేషన్ కారణంగా శరీరంలో వ్యర్ధాలు పేరుకుపోతాయి. ఈ కారణంగా, ముఖం మీద వాపు పెరుగుతుంది.

**ముఖం వాపు నుండి బయటపడే చిట్కాలు..**

1. హైడ్రేటెడ్ గా ఉండటానికి రోజంతా వీలైనంత ఎక్కువ నీరు త్రాగాలి. హైడ్రేషన్ శరీరం నుండి అదనపు ద్రవాన్ని బయటకు పంపడం ద్వారా వాపును తగ్గించడంలో సహాయపడుతుంది.

2. ఉప్పు, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తీసుకోవడం మానుకోండి. ఎందుకంటే అధిక సోడియం స్థాయిలు శరీరంలో ద్రవాలు నిలిచిపోవడానికి సహాయపడుతాయి.

3. పడుకునేటప్పుడు మీ తల పైకి ఉండేలా ఒకటి కంటే ఎక్కువ దిండులను వాడొచ్చు. ఇలా చేయడం వలన కణజాలంలో ద్రవం పేరుకుపోదు. వాపు ఏర్పడదు.

4. ఉదయాన్నే కొంత సమయం పాటు ముఖం చల్లబరచడం వల్ల వాపు నుండి ఉపశమనం పొందవచ్చు.

# అనకాపల్లిలో పీలా జగ్గారావు సంతాప సభ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఈ నెల 14న మృతి చెందిన శ్రీ నూకాంబికా అమ్మవారి దేవస్థానం మాజీ ఛైర్మన్, వ్యాపారవేత్త, స్వచ్ఛంద సేవకులు దివంగత పీలా వెంకట జగ్గారావు (పీవీజెఆర్)కు శనివారం రాత్రి జరిగిన సంతాప సభలో పట్టణ ప్రజలు నివాళులర్పించారు. శ్రీ గౌరీ గ్రంథాలయంలో జరిగిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎంఎల్‌సీ బుద్ద నాగజగదీశ్వరరావు, అత్యంత ఆప్తులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పూల మాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జగ్గారావుతో ఉన్న అనుబంధాన్ని అందరూ నెమరువేసుకున్నారు.

అనంతరం సభలో మాజీ మంత్రి 'దాడి' మాట్లాడుతూ ఎటువంటి అధికార పదవులు లేకపోయిన ఎంతో మంది నిరుపేదలకు ఉపాధి కల్పించిన జగ్గారావు మహానీయుడని అన్నారు. రాజకీయాలకు, కులాలకు, మతాలకు అతీతంగా తన ఆదాయంలో 50 శాతంకు పైగా సేవా కార్యక్రమాలకు ఆర్థికంగా చేయూత నిచ్చారని చెప్పారు. క్రీడలపట్ల ఎంతో అసక్తి గల ఆయన చిన్నతనంలో తనకు లభించని ఆటలాడే అదృష్టాన్ని ఈ నాటి యువతకు, బాలలకూ అందుబాటులోనికి తేవటానికి తన వంతు సాయం అందించేవారన్నారు. మాజీ ఎంఎల్‌సీ బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచీ ఆర్థిక సమస్యలు, కష్టాలు తెలిసిన వ్యక్తిగా నేడు ఆర్థికంగా అగ్ర స్థానానికి చేరినా తాను పడిన కష్టాలు మరవక, అలాంటి కష్టాలు పడేవార్ని ఆదుకుంటూ ఆపత్సమయాలలో పిలవకనే పలికే పేదల పెన్నిది పీలా వెంకట జగ్గారావు కీర్తి సాధించారని అన్నారు. శ్రీ జగన్నాధస్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ దాడి ఈశ్వరరావు మాట్లాడుతూ వణిక్ ప్రముఖునిగా, స్వచ్ఛంద సేవకునిగా, పేద ప్రజలకు తోడునీడగా ఉన్న జగ్గారావు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి చేసిన కృషి, దీక్ష, పట్టుదలా నేటి యువతకు ఆదర్శప్రాయమైందన్నారు. ఆర్థిక కష్టంతో గానీ, మరేద్కైనా సమస్యతోగానీ తనవద్దకు వచ్చిన పరిచయస్తులను, ఆర్తులనూ కాదని ఎరుగరని తగిన సాయం చేసి చిరునవ్వుతో వీడ్కోలు ఇవ్వటం జగ్గారావు తత్వమన్నారు. ధార్మిక, అధ్యాత్మిక కార్యక్రమాలెన్నింటికో చేతికి ఎముకలేనట్టు విరాళాలు ఇచ్చి సంస్థల అభివృద్ధికి దోహదపడ్డారాన్నరు. కార్యక్రమంలో శ్రీ గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, అధ్యక్షుడు దొడ్డి నూకఅప్పారావు, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, సినీ నిర్మాత పీలా తిలక్, మాజీ కౌన్సిలర్లు, ప్రజా సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ఆయన అభిమానులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు భద్రతపై ఎస్పీ సమీక్ష





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మురళీక్రిష్ణ, జిల్లా పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి ఎగ్జిట్ పోల్స్, 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు రానున్న సందర్భంగా, తదుపరి రోజుల్లో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా జిల్లాలోని పోలీసు అధికారులు మరియు సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

ర్యాలీలు, ఊరేగింపులు, పండుగలలో స్టేజ్ ప్రోగ్రాములకు అనుమతులు లేవని, పెట్రోల్ బంకులలో లూజ్ పెట్రోల్ అమ్మకాలు అనుమతించకూడదని, బాణసంచా తయారీ దుకాణాలను తనిఖీ చేయాలని, వాటి అమ్మకాలపై నిరంతరం నిఘా ఉంచాలని తెలియజేయడమైనది.రౌడీ షీటర్ల పై ప్రత్యేక నిఘా పెట్టడం జరిగింది. వారు ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జిల్లా నుంచి బహిష్కరించడం జరుగుతుంది.గ్రామాల్లో దాబాలు, హెూటల్లు, పాన్ షాప్ లలో అక్రమ మద్యం లభ్యం కాకుండా మరియు జూదం కోడిపందాలు కాయిన్ గేమ్, బెట్టింగ్ మొదలైన చట్ట విరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

గ్రామాల్లో పోలీసు పికెట్, పెట్రోలింగ్ మరియు చెక్ పోస్టలను ప్రణాళికతో ఏర్పాటు చేయడం జరుగుతుంది. అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహించేవారు, ప్రజలను ఇబ్బంది పెట్టేవారిని గుర్తించి, వారి కట్టడి కి బైండ్ ఓవర్ చేయడం జరుగుతుంది.ఎస్.హెచ్.ఒ , ఇన్స్పెక్టర్లు గ్రామ స్థాయి లోని వివిధ వర్గాల ప్రజలతో సమావేశాలు నిర్వహించి, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, సెక్షన్ 144 సి ఆర్ పి సి 30 పోలీస్ యాక్ట్, బౌండ్ డౌన్ గురించి వివరించి, చట్టాలను ఉల్లంఘించిన ఎడల ఉల్లంఘన (బాండ్ల జప్తు), వాటి పరిణామాలు, చట్టపరంగా తీసుకునే కఠిన చర్యల గురించి వివరించాలని పోలీస్ అధికారులకు తెలియజేశారు. ప్రజలను రెచ్చగొట్టే సందేశాలు మరియు నిరాధార ఆరోపణలు మొదలైన వాటిని సామాజిక మాధ్యమాల వేదికపై ప్రచారం చేయకూడదని అలా చేసిన ఎడల కఠినమైన చర్యలు తీసుకోబడతాయని తెలియజేయడం జరిగింది.అనుమతి లేని ర్యాలీలు, ఊరేగింపులు , సమావేశాలు, బాణసంచా పేల్చడం నిషేధం అని, అలాంటివి ప్రోత్సహించి, నిర్వహించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయి.

2014 ,2019, సాధారణ ఎన్నికలు మరియు 2021 స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎఫ్.ఐ.ఆర్ మరియు ఇతర రికార్డులలో మునుపటి ఎన్నికల నేరాలు మరియు నిందితులను గుర్తించి, వారి ప్రస్తుత కార్యకలాపాలను నిఘా ఉంచి అటువంటి వారి పై తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అభ్యర్థుల గెలుపు, ఓటములపై బెట్టింగ్‌లు నిర్వహించడం మరియు పాల్గొనడం నేరం. అటువంటి వారిపై నిఘా ఉంచడమే కాక చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.జిల్లాలోని పోలీస్ అధికారులు మరియు వారి సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, తమ తమ అధికార పరిధిపై పూర్తి నియంత్రణ కలిగి ఉండాలని, తమ పరిధిలోని లాడ్జీలు, చౌల్ట్రీలు మరియు కల్యాణ మండపం మొదలైన చోట అపరిచిత వ్యక్తులు మరియు అనుమానిత వ్యక్తులను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని,గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ లు మరియు అనుమానాస్పద గ్రామాల్లో కార్డన్ మరియు సెర్చ్ అపరేషన్ లు చేపట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయ భాస్కర్, పి. సత్యనారాయణ రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, డిటిసి డీఎస్పీ డి.రామ వర్మ, దిశా డీఎస్పీ శ్రీ ఎం.ఉపేంద్ర బాబు, ట్రైనీ డీఎస్పీ భవ్య, ఇనస్పెక్టర్ లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు మరియు కుమారస్వామి, గణేష్, సతీష్ , మన్మధరావు, ఎస్సైలు రామారావు, రఘువర్మ, మరియు జిల్లా సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజాన్ని మేలుకొలిపి చైతన్యపరిచేదే నాటకం : మాజీ మంత్రి దాడి

## వెయ్యి ప్రదర్శనలు పూర్తిచేసుకున్న 'అనగనగా ఒక రాజు' నాటిక





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రస్తుత సమాజాన్ని మేల్కొలిపి చైతన్యపరిచేదే నాటకమని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. పట్టణంలోని పార్కు సెంటర్ వద్ద వి.వి. రమణ రైతుభారతి ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో శ్రీమతి జ్యోతి సరళ స్మారక కళా పరిషత్ ఆధ్వర్యంలో డైమండ్ హిట్స్ వ్యవస్థాపకులు, మాజీ మంత్రివర్యులు దాడి వీరభద్రరావు గారి సౌజన్యంతో 1975 పదో తరగతి పూర్వ విద్యార్థుల సహకారంతో గత మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటికలలో భాగంగా చివరిరోజు ప్రదర్శించిన 'అనగనగా ఒక రాజు' నాటిక అందరినీ అలరించింది. మాజీ మంత్రి వర్యులు, తెదేపా కేంద్ర ఎన్నికల సంఘం, మీడియా సమన్వయకర్త దాడి వీరభద్రరావు గారు, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ గారు తదితరులు విచ్చేసి కార్యక్రమాన్ని తిలకించారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు రచించిన 'అనగనగా ఒక రాజు' నాటిక ఆద్యంతం అందరిని ఆకట్టుకొంది. ప్రస్తుత సమాజాన్ని ప్రతిబింబించేవిధంగా ప్రదర్శించిన ఈ నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా దాడి వీరభద్రరావు గారు మాట్లాడుతూ 45 ఏళ్ల కిందట తాను రాసిన సమాజం నేటికీ అలాగే ఉందన్నారు. ఈ రోజుకీ సమాజం మారిందా అని ప్రశ్నిస్తున్నానన్నారు. సాంఘిక ప్రయోజనం లేకపోతే అది నాటకమే కాదని అన్నారు. తాను రచించిన అనగనగా ఒక రాజు నాటకం వెయ్యి ప్రదర్శనలు పూర్తిచేసుకుందని తెలిపారు. ఈ నాటికను ప్రదర్శించిన పాత్రదారులంతా అద్భుతంగా నటించారని అన్నారు. ముఖ్యంగా స్త్రీ పాత్రధారిణి విజయలక్ష్మి 45 ఏళ్ల కిందట ఏ పాత్ర ధరించిందో నేడు అదే పాత్ర పోషించిందని అభినందించారు. ఈ ఆహ్వాన నాటిక పోటీల్లో గెలుపొందిన నాటక విజేతలకు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ బహుమతులు అందజేశారు. అధిక సంఖ్యలో ప్రేక్షకులు ప్రదర్శనలు తిలకించారు.

# రాష్ట్రస్థాయి ఆహ్వానపు నాటిక పోటీలలో ఉత్తమ ప్రదర్శన" బంధం"



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లిలో శ్రీమతి జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ వారు స్థానిక వివి రమణ రైతు భారతి ఓపెన్ ఎయిర్ థియేటర్లో ఈనెల 17 నుండి మూడు రోజులు పాటు జరిగిన రాష్ట్రస్థాయి ఆహ్వానపు నాటక పోటీలలో మైత్రి కళా నిలయం విజయవాడ వారి బంధం నాటిక ఉత్తమ ప్రదర్శన బహుమతి గెలుచుకుంది. ద్వితీయ తృతీయ బహుమతులను కళాభినయ విశాఖపట్నం వారి కాశీ వాసి రావయ్య నాటిక ద్వితీయ బహుమతిని, అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి అమృత హస్తం నాటిక గెలుపొందాయి. ఈ నాటిక పోటీలకు కోరుకొండ శేషగిరిరావు దండు నాగేశ్వరరావు వివి రామారావు న్యాయ నిర్ణేతులుగా వ్యవహరించారు. ఈ నాటిక పోటీల ముఖ్య నిర్వహకులు పిసిహెచ్ నాయుడు మాట్లాడుతూ మన రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో నాటికలు పోటీలు జరుగుతున్న మన అనకాపల్లి కి వచ్చి ప్రదర్శించిన ఆరు సమాజాల కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ నాటిక పోటీలు దాడి వీరభద్ర రావు దాడి రత్నాకర్ సహకారంతో మరియు మున్సిపల్ హై స్కూల్ పెద్ద హై స్కూల్ పూర్వపు విద్యార్థుల సహకారంతో రైతు భారతి ఆడిటోరియం యాజమాన్యం సహకారంతో నిర్వహించామన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి మన అనకాపల్లి పట్టణంలో కళా ప్రేమికులు సహకారంతో ప్రేక్షకులు సహకారంతో మా నాటిక పోటీలు దిగ్విజయం చేసినందుకు ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదములు తెలియ చేశారు ఈ నాటిక పోటీలకు విశేషంగా ప్రచారం చేసిన పత్రికా ప్రతినిధులందరికీ హృదయపూర్వక నమస్కారములు తెలిపారు. ఈ నాటిక పోటీలలో బహుమతులు గెలుచుకున్న కళాకారులకు డైట్ కాలేజ్ కరస్పాండెంట్ దాడి రత్నాకర్ చేతులమీదుగా అందజేశారు . మరియు ఉత్తమ నటిగా బంధం నాటిక నుండి రత్న కుమారి, ఉత్తమ నటుడుగా నాలోన నీవే నాటికనుండి రామకృష్ణ ఉత్తమ దర్శకులుగా బంధం నాటిక నుండి టీవీ పురుషోత్తం, ఉత్తమ రచయితగా నాన్న బంగారు నాటిక రచయిత మూర్తి గెరిపొందారు. వ్యక్తిగత బహుమతులు దాడి రత్నాకర్ చేతుల మీదుగా అందజేసినారు నాటిక పోటీలు అనంతరం దాడి వీరభద్ర రావు గారు 45 సంవత్సరాల క్రితం రచించిన అనగనగా ఒక రాజు నాటిక విశాఖపట్నం కళాకారుల పిసిహెచ్ నాయుడు బృందంతో ప్రదర్శించి ప్రేక్షకులు మన్ననలు పొందారు.

# మనిషికి కావలసిన సంపద ఏంటో తెలియచెప్పిన నాటిక నాన్న బంగారు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి రైతు భారతిలో జరుగుతున్న ఆహ్వానపు నాటికి పోటీల్లో శనివారం రాత్రి ప్రియదర్శిని నెల్లూరు వారిచే ప్రదర్శించబడిన నాటిక నాన్న బంగారు, రచన దర్శకత్వం: జిబికె మూర్తి వహించిన నాటిక ప్రేక్షకులును అధ్యయంతో ఆకట్టుకుంది. నాటిక వృత్తం లోకి వెళితే ఎదురుగా వున్న బిడ్డను ముద్దు పెట్టుకున్నప్పుడు కలిగే అనుభూతి, ఆ బిడ్డ ఫోటోను ముద్దు పెట్టుకున్నప్పుడు కలుగదు, ఎందుకంటే మొదటి దానిలో జీవం ఉంటే, రెండవ దానిలో దాని ప్రతిబింబం ఉంటుంది.. అలాగే, వీడేమో కాల్ లో మనిషికి, మనిషికి మధ్య స్క్రీన్ అడ్డం ఉంటుంది. వీడేమో కాల్, బిడ్డ ఫోటో ను ముద్దు పెట్టుకోవటం లాంటిది.

ఇల్లు స్వీట్ హెూమ్ కావాలంటే, కుటుంబ సభ్యులు అందరు ఫిసికల్ గా దగ్గరగా ఉండాలి, టచ్ ఉండాలి, స్వచ్ఛమైన ప్రేమ, అభిమానాలు ఉండాలి. అది, సంపద, అంటే. ఆ సంపదను ఇప్పుడు కొందరు తండ్రులు, బిడ్డలకు 60 ఏళ్ళు వచ్చిన వాడికేం తెలీదు, పసివాడు అన్న మాయలో వాడి జీవితాన్ని ఉద్ధరిస్తున్నాము అనుకుంటారే కానీ, బిడ్డ మనసును గాయ పరుస్తున్నాము అని గ్రహించరు.

మేం ఎక్కడికి వెళ్ళము, మీ దగ్గరే ఉంటాము అని కొడుకులు ప్రాదేయ పడుతూ వున్నా, పక్కింటి సుబ్బారావు కొడుకు అమెరికా, ఎదురింటి పంకజం అల్లుడు ఆస్ట్రేలియా, నువ్వు ఇక్కడ ఉంటే, మా తల కొట్టేసినట్టుగా ఉంటుంది, నువు వెళ్ళితీరాలి అని కొడుకుల్ని బలవంతంగా దూరం చేసుకుంటున్నారు. కానీ, జీవితం చాలా చిన్నది, అందులో ప్రతి క్షణాన్ని అనుభవించాలి, ఆస్వాదించాలి, గడిచి పోయిన క్షణం తిరిగి రాదు,మిస్ అయింది మళ్ళీ దొరకదు, ఆఖరి దశలో మనిషికి ఓదార్పు, ఊరట ఇచ్చేది కన్నబిడ్డల సాన్నిత్యం, ఆత్మీయ స్పర్శ, అందులో వుండే భరోసా,

ఆనందం, అమెరికా డాలర్ లో లేదు అని చేతులు కాలాక గ్రహిస్తారు.మనిషి కి కావలసిన సంపద ఏంటి అని తెలియ చేసేదే నాన్న బంగారు నాటిక.

# ప్రేక్షకులను మెప్పించిన బంధం నాటిక



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గవరపాలెం రైతు భారతి లో జరుగుతున్న శ్రీమతి జ్యోతి సరళస్మారక కళా పరిషత్ ఆహ్వానపు రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో శనివారం రాత్రి జ. మైత్రి కళానిలయం విజయవాడ వారి బంధం నాటిక ప్రదర్శన ఇతి వృత్తం మనిషి జీవితం బంధుత్వంతో మొదలవుతుంది తల్లిదండ్రులు తోడబుట్టిన వాళ్ళు మిత్రులు గురువులు పెళ్ళయ్యాక పెళ్ళాం బిడ్డలు ఇలా ఎన్నో బంధాలు కానీ కడదాకా కలిసి ప్రయాణం చేసే భార్యాభర్తల బంధం ఎంతో పటిష్టమైనది విడదీయ రానిది అందులో వృద్ధాప్యంలో ఈ బంధం మరింత బలపడి ఒకరికొకరు ఒకరికొకరిగా మిగిలిపోతారు. కన్నవాళ్ళ రెక్కలు వచ్చి ఎగిరిపోతే మిగిలేది ఆ ఇద్దరే వృద్ధాప్యం మనిషికి రెండో భాగం పసితనంలోనే అలకలు మంకుపట్టు ప్రేమలు ఇవన్నీ కీచులాటలు తాత్కాలికం ఇస్తారు క్షణంలో మళ్లీ కలుస్తారు. కొత్తదనం తన వెర్రి ఆలోచనలతో కోరుకున్న సుబ్బారాయుడు లోకం హర్షించని రీతిలో భార్యను దూరం పెడతాడు. స్నేహితుడు నారాయణ హితోక్తులు వినడు తాను ఒక కొత్త గేమ్ మొదలెట్టాలనుకుంటాడు కానీ ఆ గేమ్ తల క్రిందలు చేస్తూ ఆ పైవాడు మరో గేమ్ ఆడి అతని మనస్థాపానికి గురిచేస్తాడు. తట్టుకోలేని సుబ్బారాయుడు విలపిస్తాడు. ఊహించిన మరో మలుపుతో కళ్ళు తెరచి తన తప్పు తెలుసుకుంటాడు. నాటిక రచన శ్రీ మాడుగుల రామకృష్ణ, దర్శకత్వం టీవీ పురుషోత్తం పాత్రలు, పాత్రధారులు సుబ్బారాయుడు, పాత్రలో టీవీ పురుషోత్తం, లలితాంబ ఎం రత్నకుమారి ,నారాయణ ఎన్ఎస్ఆర్సి ప్రసాద్,, పోతప్పుడు పి.బాబురావు, సర్వమంగళం జి రాధాకృష్ణ నాటికకు సంగీతంపి. లీలామోహన్ సమకూర్చారు. పాత్రధారులు తమ నటనతో ప్రేక్షకులను మెప్పించారు. పాత్రధారులు నాటిక అధ్యయంతో తమ నటనతో ప్రేక్షకులను కట్టిపడేశారు.

# నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అయిన అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలు భక్తులు తరలివచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం ఆవరణలో వెలుపల భక్తులు ఎండను సైతం లెక్కచేయకుండా బారులు తీరారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. దేవస్థానం ఆవరణ కాటేజీలు నిండిపోవడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో తోటల్లో భక్తులు కుటుంబ సమేతంగా వంటలు వండుకొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

## భోగాపురం విమానాశ్రయ ప్రాంతాన్ని పరిశీలించిన జవహర్‌రెడ్డి



**విజయనగరం:** విమానాశ్రయ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని, రాష్ట్రప్రభుత్వ ఛీఫ్ సెక్రటరీ కెఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డు విమానాశ్రయ నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఎయిర్‌పోర్టు టెర్మినల్ భవనం, రన్‌వే, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్ భవనాలు, ఇతర నిర్మాణ పనులను ఆయన సందర్శించారు. ఎయిర్‌పోర్టు ప్లాన్లను పరిశీలించారు. నిర్మాణ పనులకు సంబంధించిన అంశాలను జిఎంఆర్ ప్రతినిధులు వివరించారు. ఇప్పటివరకు జరిగిన పనులపట్ల జవహరరెడ్డి సంతృప్తిని వ్యక్తం చేశారు.

ఈ పర్యటనలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ఆర్‌డిఓ ఎంవి సూర్యకళ, తాశిల్దార్ శ్యామ్ ప్రసాద్, జిఎంఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ సిఇఓ మనోమయ్ రాయ్, ప్రాజెక్టు హెడ్ బిహెచ్.ఎ.రామరాజు, ఇతర ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మునిసిపాలిటీలో కలుషిత నీటితో ఇబ్బందులు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** పార్వతీపురం మున్సిపాలిటీలో గత వారం రోజులు నుండి ప్రతి వార్డులో వీధి కుళాయిల ద్వారా రంగు మారిన నీరు మబ్బు నీరు వస్తుందని పట్టణ ప్రజలు త్రాగునీరు సమస్యపై ఇబ్బంది పడుతున్నారని సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ బంకురు సూరిబాబు ఆధ్వర్యంలో పార్వతీపురం మున్సిపల్ కార్యాలయంలో డి ఈ కిరణ్ కి ఆర్ ఓ రుబెన్ కి వినతిపత్రం ఇచ్చారు ఈ సందర్భంగా గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ గత పది సంవత్సరముల నుండి పార్వతీపురం మున్సిపాలిటీలో త్రాగునీరు రంగు మారిన నీరు వస్తున్నదని దీన్ని అరికట్టడంలో మున్సిపాలిటీ విఫలమైందని ఇప్పటికైనా సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బంకురు గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థిని కలిసిన బీజేపీ నాయకులు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి నియోజక వర్గ కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ను ఆనందపురం మండలం కు చెందిన బీజేపీ నాయకులు సోమవారం మర్యాద పూర్వకం గా కలిశారు. ఎంవీపీ కోలనీ లో గల గంటా శ్రీనివాసరావు నివాసం కు వెళ్లిన బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పివివి ప్రసాద్ రావు పట్నాయిక్ ఆధ్వర్యంలో పలువురు గంటా శ్రీనివాసరావు కు పుష్ప గుచ్ఛం ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు బోర శ్రీనివాసరెడ్డి, పి సాయి రమేష్, కెవివి సూర్యనారాయణ, సత్తి రాజు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం

### వాహనం లోయలోపడి 17 మంది మృతి



ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. కవర్ధా ప్రాంతంలో వాహనం బోల్తాపడి 17 మంది మృతి చెందారు. 8 మందికి గాయాలయ్యాయి. కబీర్‌ధామ్ జిల్లాలో ఓ లోయలో వాహనం పడిపోయింది. మృతుల్లో 14 మంది మహిళలు ఉన్నట్లుగా తెలుస్తోంది. బైగా ట్రైబల్ కమ్యూనిటీకి చెందిన 25 నుంచి 30 మంది బీడీ ఆకుల కోసం వెళ్లారు. ఆకులు ఏరిన తర్వాత వారిని పికప్ వాహనం వెనక్కి తీసుకువస్తోంది.

ఈ సమయంలో వాహనం లోయలోకి బోల్తా కొట్టింది. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ వాహనంలో ప్రయాణిస్తున్న వారంతా కుయ్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. బైగా కమ్యూనిటీ ఎక్కువగా బీడీలు చేస్తుంది. బీడీ ఆకు కోసం వీరు అడవులకు వెళుతుంటారు. ఈ ఆకులు మార్చి నుంచి మే మధ్య వస్తాయి.

## డైట్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ హ్యాపీనెస్ ప్రోగ్రాం





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో పండిట్ రవిశంకర్ చే స్థాపించబడిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వారిచే హ్యాపీనెస్ ప్రోగ్రాం అనబడే ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంను సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంను డైట్ కళాశాల అధ్యాపకులకు , అధ్యాపకేతర సిబ్బందికి సోమవారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దాడి రత్నాకర్ మాట్లాడుతూ హ్యాపీనెస్ ప్రోగ్రాం అనే ఈ కార్యక్రమంలో శారీరిక ఆరోగ్యాన్ని మానసిక ప్రశాంతతను పొందవచ్చునని మరియు ఒత్తిడిని అధిగమించి జీవితాన్ని ఆనందంగా జీవించవచ్చునని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంతరావు మాట్లాడుతూ యోగా జీవితంలో చాలా ముఖ్యమైనదని తద్వారా అందరూ నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ రీజినల్ డైరెక్టర్ పద్మావతి మాట్లాడుతూ ఆధునిక జీవనంలో ఒత్తిడి అంతర్భాగమైందని హ్యాపీనెస్ ప్రోగ్రాం కార్యక్రమం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చని మరియు ప్రశాంతమైన జీవితాన్ని పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ డాక్టర్ ఈశ్వర్ రావు, డాక్టర్ పార్వతి , అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణనాగ్ , వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు ,కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** పట్టణ నందమూరి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్సులు యడ్ల శ్రీను,శెట్టి నారాయణ, గౌరవ అధ్యక్షులు మజ్జి కృష్ణారావు ఆద్వర్యంలో యన్ టి ఆర్ 41.వ పుట్టినరోజు వేడుకలు పార్వతీపురం పద్మశ్రీ థియేటర్ ఆవరణలో జరిగాయి. అభిమానులందరూ అభిమాన కథానాయకుడు జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్స్ పంచుకున్నారు ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ! ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా అఖండ విజయం సాధించి తద్వారా నిర్మాతలు డిస్ట్రిబ్యూటర్స్ ఎగ్జిబిటర్స్ సినీ రంగంలో పని చేయుచున్న ప్రతి కార్మికుడు ఆర్థిక అభివృద్ధి చెందాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాకల సన్యాసిరావు, ముట్నూరు వెంకటరమణ, 8.వ.వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, ఈదుబిల్లి సంతు, రౌతు చిన్న, బూర్లి వెంకటేష్ ,మక్కువ కిషోర్ ,పల్లి గంగాధర్ జవ్వాది పోలిరాజు, నేరడుబిల్లి గౌరీ,చొక్కాపు వెంకటరమణ ,సొండి చంద్ర మరియు నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

అభిమాని అయిన ఈదుబిల్లి సంతు పుట్టినరోజు వేడుకలు కూడా ఇందుతో జరిపారు.

## గాయత్రిలో ఘనంగా ముగిసిన కార్యశాల



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక ఋషి కొండలో గాయత్రీ విద్యా పరిషత్ యం.బి.ఏ హాల్ లో అయిదు రోజుల సిబ్బంది అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించిన కార్య శాల నిర్వహించబడింది. శ్రీ రఘు పులపర్తి, వైస్ ప్రెసిడెంట్ జీపెన్ లాజిక్స్, విశాఖపట్టణం తన ప్రసంగంలో ,సమయపాలన, వ్యక్తిత్వం గురించి మంచి ఉదాహరణలలో వివరిస్తూ సంస్థ అభివృద్ధికి ఇవి చాలా ముఖ్యమైనవి అన్నారు. రెండో రోజు సదస్సులో వ్యక్తిత్వ వికాసం గురించి డా.ఏ. సాయి బాల. శ్రీమతి వి.పూర్ణిమ ఆఫీసు లేఖా రచనం గురించి నైపుణ్యాలను గురించి వివరించారు. గాయత్రీ కళాశాలు పూర్వ విద్యార్థి అశ్విన్ పటేల్ ఒత్తిడిని అధిగమించడం గురించి వివరించారు. మూడో రోజు డాక్టర్ రవిశంకర్ తమ ప్రసంగంలో ఉద్యోగస్తులకు శారీరిక రుగ్మతలను, ఒత్తిడిని తొలగించుకోడానికి అవసరమైన శారీరక యోగసాధన గురించి తెలియ చేశారు. ఆఫీసులో ఉద్యోగస్థులు నియమపాలన విలువలు పాటించడం, మర్యాదను పాటించడం. నిర్మాణాత్మకంగా పని చేసి సంస్థ ప్రతిష్ఠను పెంపొందింప చేయాలని డాక్టర్ యు.వి.యస్.యన్. శాస్త్రి ప్రసంగించారు .పుర ప్రజలతో ఉద్యోగము , సంబంధబాంధవ్యాలు అభివృద్ధి పరుచుకొనే జీవన విధానం గురించి వివరించారు. నాలుగు అయిదవ రోజు వాట్సాప్, ఫేస్'బుక్ వినియోగం గురించి వివరించారు. ముగింపు సభలో ఆచార్య కె.యస్. బోస్, ప్రిన్సిపాల్ గాయత్రి విద్యా పరిషత్,ఆచార్య ప్రగడ రాజ గణపతి , గాయత్రి విద్యా పరిషత్ సభ్యులు, డి.వి.ఎస్. కామేశ్వరరావు ,గాయత్రి విద్యా పరిషత్ సభ్యులు కార్య శాలలో పాల్గొన్న ఉద్యోగులను అభినందించారు. నిర్మాణాత్మక ప్రగతికి ఈరకమైన కార్య క్రమాలు దోహదపడతాయని డా.ఫ్లొరెన్స్ వందన సమర్పణ చేశారు. శ్రీ యతలు దక్షిణామూర్తి గారు , ఆచార్య పి.వి శర్మ గారు గాయత్రి విద్యా పరిషత్ సభ్యులు,ఆచార్య సోమరాజు గారు సెక్రటరీ గాయత్రి విద్యా పరిషత్, ఆచార్య వినయ్ గారు డీన్ ఇంజనీరింగ్ విభాగం గాయత్రి విద్యా పరిషత్,శ్రీమతి పద్మ గారు పి.ఆర్.ఓ గాయత్రి విద్యా పరిషత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గాయత్రీ కళాశాలలో ముగిసిన భాషల శిక్షణ శిబిరం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక యం.వి.పి కోలనీలో ఉన్న గాయత్రి (అటానమస్) సమావేశ మందిరంలో "ఎన్ రిచింగ్ హ్యూమన్ వాల్యూస్ త్రూ లాంగ్వేజ్ లెర్నింగ్ అనే పేరుతో ఈ నెల14వ తేదీన మొదలైన ఏడురోజుల కార్య శాల ముగింపు సమావేశం ఘనంగా జరిగింది. దీనిని సంస్కృతం, హిందీ , తెలుగు విభాగములు సమైక్యంగా నిర్వహించారు.

డైరక్టరు గోపీకుమార్ బులుసు , సాంఖ్య టెక్నాలజీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.

డా.యి.వి.ఎస్.ఎస్.శాస్త్రి అతిథి పరిచయం చేసారు.అతిథి గోపి కుమార్ బులుసు, సి.ఇ.ఓ. సాంఖ్య టెక్నాలజీస్ ఎక్జిక్యూటివ్ ,తన ప్రసంగంలో ప్రపంచ విజ్ఞాన నిధికి సంస్కృతభాష ముఖ్య ద్వారంగా పేర్కొన్నారు . ప్రముఖ వ్యాకరణ శాస్త్రవేత్త ప్రాణిని రచించిన అష్టాధ్యాయి' లో సూత్రీకరించిన భాష కంప్యూటరీకరవణకు మూలం అని, అనువయినదిగా తెలియచేశారు. విశ్వవిఖ్యాత దార్శనికులయిన ప్రధాని నరేంద్ర మోదీ "వికసితభారత్" లక్ష్యం భాషల ద్వారా సుసాధ్యం అని సభలో తెలియ చేశారు. శ్రీ యుతులు డి.వి.యస్. కామేశ్వరరావు, ఆచార్య వి.యస్.ఆర్. కృష్ణ ప్రసాద్ సంప్రదాయం, సంస్కృతి, విలువలు, మానవీయ సంబంధాలకు భాషలే మూలం అన్నారు. ఆచార్య పులుగుర్త వ్యాజ్ఞేశ్వర శర్మ కార్యశాలకు రూపకల్పన చేసిన భాషా విభాగమును, "హాజరయిన విద్యార్థులను, వారి తల్లి తండ్రుల లను అభినందించారు. వేసవిసెలవులు- విద్యార్థులు తీరిక సమయాన్ని మంచిగా వినియోగించుకొన్న విద్యారులను ఆచార్య కె.యస్. బోస్, కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ అయ్యగారి ఆనంద్. డైరెక్టర్ యు.జి .కోర్సులు వారు అభినందించారు. ఏడురోజులలో జరిగిన విశేషాలను డా.వారణాసి వేంకటేశ్వరశర్మగారు సభలో సమర్పించి సంస్కృత సంభాషణ సులభ సాధ్యమని నిరూపించారు. ఈ సందర్భంగా విద్యారులు చేసిన నృత్యం ఆహూతులను అలరించింది. హిందీగేయాలు, తెలుగు పద్యాలను విద్యార్థులు వినిపించారు. శ్రీయుతులు డి.గిరధర్. ప్రాంగణ నియామకుల అధికారి, హాజరయిన విద్యారులకు ధ్రువపత్రాలను అందించారు. సభాసంచాల కత్వం శ్రీమతి ఏ.రమణి చేయగా, వందన సమర్పణ డాక్టర్ కె.అనిత చేయగా, కార్యక్రమం ముగిసింది. శ్రీకృష్ణ కుమార్, డా.సుజాత, డా.హెప్సీ, సుష్మ డాక్టర్ శ్రీ దేవి డాక్టర్. వి.రాధిక తదితరులు హాజరయి కార్యక్రమం విజయవంతం చేశారు.

## శ్రీ క్షేత్రం లో భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రం లో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సుదర్శనహోమం గావించారు. సోమవారం ఉదయం చిత్తా నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయం అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ అచార్యులు,చామర్తి రమేష్ ఆచార్యులు సంయుక్తంగా వేదమంత్రాల నడుమ సుదర్శన హోమం గావించారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులు పాల్గొన్నారు

## పేద ముస్లిం పిల్లలకు ఉచితంగా సున్తీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పేద ముస్లిం పిల్లలకు ఉచితంగా సున్తీ వైద్య శిబిరం సీరత్ కమిటీ నిర్వహించడం అభినందనీయమని ఉత్తర నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు అన్నారు. ఈ మేరకు స్థానిక దొండపర్తి లోని సింకా గ్రాండ్ హొటల్లో సీరత్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత (ఖత్నా)సున్తీ వైద్య శిబిరం సోమవారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సీరత్ కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ లతీఫ్, గౌరవ అధ్యక్షులు హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ పేద ముస్లిం పిల్లలకు ఉచితంగా సున్తీ (ఖత్నా) కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు మీడియా తో మాట్లాడుతూ సుమారు 250 మంది పేద ముస్లిం పిల్లలకు ఉచిత ( ఖత్నా) సున్తీ చేసినట్టు తెలిపారు. ముస్లిం సంప్రదాయం ప్రకారం ఇస్లామిక్ ధర్మంతో ఈ కార్యక్రమం ప్రతి ఏటా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇందుకోసం విజయ వాడ నుండి విచ్చేసిన అనుభవిజ్ఞులైన వైద్యులైన డాక్టర్ మౌలాలి వారిచే ఈ ఉచిత వైద్య శిబిరం చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైసీపీ మైనార్టీ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐహెచ్ ఫారూఖి, కమిటీ కార్యదర్శి జనాబ్ మెహబూబ్ షరీఫ్, కోశాధికారి ముస్తాక్ అహ్మద్, వ్యవస్థాపకులు షబ్బీర్, మహమ్మద్ రఫీ, మునీర్ ఖాన్, అబ్దుల్ ఆసీఫ్, అహమ్మద్ అలీ, అబ్దుల్ మునీర్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత షేక్ బాబ్జి , తదితరులు పాల్గొన్నారు.

## భీమిలి ప్రజలకు గంటా హామీ



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా ఎన్నికల్లో తాను గెలిచిన తరువాత టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు అండగా ఉండడం తో పాటు ఎల్లప్పుడూ నియోజకవర్గం ను అంటిపెట్టుకొనే ఉంటానని భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు స్పష్టం చేసారు. ఎన్నికల్లో తనకోసం కష్టపడిన మూడు పార్టీ ల శ్రేణులతో వాల్తే ర్ క్లబ్ లో ఆదివారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూతన గెలుపు కోసం ఎంతో నిబద్ధతో పనిచేసిన మూడు పార్టల శ్రేణులు ఉండడం తన అదృష్టం అని ఆయన అన్నారు. ముఖ్యంగా గత నాలుగన్నర ఏళ్లుగా భీమిలి నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ ఉన్నతికి పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కోరాడ రాజబాబు ఏంతో శ్రమించారాని ఆయన కితాబు నిచ్చారు.రాష్ట్రం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డు దుర్మార్గపు పాలన చేసారని ఆయన ఆరోపించారు. దాని ఫలితంగా జూన్ 4 న ప్రజల తీర్పు రాబోతున్నదని ఆయన అన్నారు. జగన్ ను గద్దె దించడానికి రాష్ట్రం లో అన్ని వర్గాల ప్రజలు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసారని ఆయన అన్నారు. రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం ఏర్పడి జూన్ 9 న ముఖ్యమంత్రి గా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఆయన అన్నారు.చివరిగా నియోజకవర్గ స్థాయి కూటమి నాయకులు గంటా శ్రీనివాసరావు ను సన్మానించారు. కార్యక్రమం లో మూడు పార్టీ లకు చెందిన నాయకులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా



## తండ్రీకొడుకులిద్దరు ఒకేసారి ముగిస్తున్నారా?



ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో మెగా హీరోలంతా మళ్లీ యాక్షన్ అంటూ రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. మెగాస్టార్ చిరంజీవి 'విశ్వంభర' షూట్ లో.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' షూట్ లో బిజీ అయ్యారు. అయితే తండ్రీకొడుకులిద్దరు ఒకేసారి షూటింగ్ ముగించబోతున్నారా? ఇద్దరు జూన్ కల్లా షూట్లు పూర్తి చేసి ఫ్రీ అయిపోతారా? అంటే అవుననే సన్నిహిత వర్గాల సమాచారం. ఇప్పటికే 'గేమ్ ఛేంజర్' షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. రెండళ్లగా సెట్స్ లో ఉన్న సినిమా ఎట్టకేలకు చరణ్ పోర్షన్ కి సంబంధించి షూట్ క్లైమాక్స్ చేరుకుందిట. జూన్ కల్లా అతడి పార్ట్ పూర్తవుతుందని సమాచారం. ఈ నేపథ్యంలో చరణ్ ఆర్సీ 16 కి కూడా డేట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. 'గేమ్ ఛేంజర్' కి సంబంధించి అదనంగా రీషూట్ ..పెండింగ్ షూట్ ఏమైనా ఉంటే ఆర్సీ 16 తో పాటు పూర్తి చేయొచ్చు అన్న ధీమాతోనే బుచ్చిబాబు కి డేట్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక చిరంజీవి కూడా జూన్ కల్లా 'విశ్వంభర' నుంచి బయటకు వచ్చేస్తారని సమాచారం. షూటింగ్ ప్రారంభమైన మారేడుమిల్లి షూట్ మినహా అన్ని షెడ్యూల్స్ లోనూ నిర్విరామంగా చిరు పాల్గొన్నారు. దీంతో ఆయన పార్ట్ షూటింగ్ కూడా ముగింపుకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే చిరు 157 కూడా పట్టాలెక్కించే సమయం దగ్గరపడినట్లే. జూన్ నుంచి ఖాళీ అయితే ఆ ప్రాజెక్ట్ కి సంబంధించిన పనుల్లో బిజీ అవుతారు. ఇంకా ఆసినిమాకి దర్శకుడిని ఫైనల్ చేయాల్సి ఉంది. కథ విషయంలోనూ కొంత క్లారిటీ రావాల్సి ఉంది. ఇవన్నీ జరగాలంటే చిరంజీవి 157 పై అంతే సీరియస్ గా పనిచేయాల్సి ఉంది. 'విశ్వంభర'కి సంబంధించి చిరు అవసరం మళ్లీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలయ్యే వరకూ ఉండదు కాబట్టి అంతవరకూ 157 పనుల్లోనే బిజీ అవుతారు. పైగా ఈ చిత్రాన్ని చిరంజీవి కుమార్తె సుస్మిత నిర్మిస్తున్నారు కాబట్టి మరింత శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇంకా చిరు కమిట్ మెంట్ ఇచ్చిన దర్శకులు కొంత మంది ఉన్నారు. వాళ్లను మళ్లీ టచ్ లోకి తేవాల్సిన అవసరం ఉంది.

## ముగింపు దశలో పుష్ప-2 చిత్ర నిర్మాణం



తెలుగు ప్రేక్షకులు మాత్రమే కాకుండా హిందీ, తమిళ ఇతర భాషల సినీ ప్రేక్షకులు సైతం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న క్రేజీ సీక్వెల్ పుష్ప 2. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెల్సిందే. రెండేళ్లుగా పుష్ప 2 సినిమా కోసం ప్రేక్షకులు ఎదురు చూస్తున్న నేపథ్యంలో ఆగస్టు లో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. ఇప్పటికే షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. జూన్ పూర్తి అయ్యే లోపు పుష్ప 2 కూడా పూర్తి అయ్యే విధంగా ప్లాన్ చేస్తున్నారట. ఒక వైపు అల్లు అర్జున్ వ్యక్తిగత పనులతో బిజీగా ఉన్నా కూడా మరో వైపు పుష్ప 2 సినిమా షూటింగ్ కు మాత్రం అంతరాయం లేకుండా కొనసాగిస్తున్నారు. పుష్ప 2 సినిమా షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రత్యేకంగా వేసిన సెట్టింగ్ లో జరుగుతున్నట్లుగా సమాచారం అందుతోంది. చిత్ర యూనిట్ సభ్యుల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం రామోజీ ఫిల్మ్ సిటీలో అత్యంత ఖరీదైన మలేషియా థీమ్ సెట్ ను నిర్మించారు. అక్కడ యాక్షన్ సన్నివేశాలతో పాటు కొన్ని ముఖ్యమైన బ్లాక్ మాఫియా కి సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. సినిమాలో వచ్చే మలేషియన్ బ్యాక్ డ్రాప్ సన్నివేశాలు అత్యంత కీలకంగా ఉంటాయట. అందుకే సెట్ కోసం భారీగా ఖర్చు చేసి రామోజీ ఫిల్మ్ సిటీలో వేయించారు. నేచురాలిటీకి బాగా దగ్గరగా ఉండే విధంగా సెట్ నిర్మాణం జరిగినట్లుగా యూనిట్ సభ్యులు ఆఫ్ ది రికార్డ్ అంటున్నారు. ప్రస్తుత షెడ్యూల్ పూర్తి అయితే ఇప్పటికే రికార్డింగ్ పూర్తి చేసిన ఐటెం సాంగ్ చిత్రీకరణ మొదలు పెట్టబోతున్నారు. బాలీవుడ్ కు చెందిన అందాల స్టార్ హీరోయిన్ ను ఇప్పటికే ఐటెం సాంగ్ కు సంప్రదించడం, ఆమె ఓకే చెప్పడం జరిగిందట. షూటింగ్ సమయంలో అధికారిక ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయి.



## టాలీవుడ్ నుంచి బ్యాన్ చేస్తామని బెదిరించారు: పాయల్

ఆర్.ఎక్స్ 100 బ్యూటీ పాయల్ రాజ్‌పుత్ తన నిర్మాతలపై సంచలన ఆరోపణలు చేసారు. తనపై పరుష పదజాలం ఉపయోగించడమే కాకుండా టాలీవుడ్ నుంచి బ్యాన్ చేస్తామని తన సినిమా రక్షణ నిర్మాతలు బెదిరించినట్టు వెల్లడించారు. తన పారితోషికానికి సంబంధించిన బకాయిలను చెల్లించడంలో విఫలమైనందున వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కూడా పాయల్ హెచ్చరించింది. సోషల్ మీడియాలో తన కష్టాలను ప్రస్తావిస్తూ సుదీర్ఘ లేఖను షేర్ చేసింది. తాను సినిమాను ప్రమోట్ చేయకపోతే తెలుగు సినిమాల నుండి నిషేధిస్తానని రక్షణ మేకర్స్ బెదిరించారని ఈ లేఖలో స్పష్టంగా పేర్కొంది. ఇటీవల ఓ సమావేశంలో రక్షణ నిర్మాతలు తనపై అనుచితమైన భాషను ఉపయోగించారని, ఒక పంపిణీదారు తప్పుడు విధానంలో మాట్లాడారని సోషల్ మీడియా నోట్ లో పాయల్ ఆరోపించింది. ప్రమోషన్ల కోసం తన బృందం తమతో చర్చలు జరిపేందుకు ప్రయత్నించిందని, అయితే వారు తనకు బకాయిలు చెల్లించేందుకు నిరాకరించారని పాయల్ పేర్కొంది. 2019 - 2020లో చిత్రీకరించిన చిత్రం రక్షణ. నిజానికి 5Ws అని టైటిల్ పెట్టారు. ఈ సినిమా విడుదల ఆలస్యం అయింది. ఇప్పుడు వారు బకాయిలు చెల్లించకుండా ప్రమోషన్స్‌కి పిలవకుండా సినిమాని రిలీజ్ చేస్తున్నారు. నా ఇటీవలి విజయం నుండి ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. నా బృందం ప్రమోషన్స్ కోసం నా సౌలభ్యం గురించి తెలియజేసేందుకు సిద్ధంగా ఉంది. ముందస్తు కమిట్‌మెంట్‌ల కారణంగా నేను బిజీగా ఉన్నాను. కానీ వారు తెలుగు సినిమా నుంచి నన్ను బ్యాన్ చేస్తామని బెదిరించారు. రక్షణ డిజిటల్ ప్రమోషన్ కోసం చర్చలు జరపడానికి మేం ప్రయత్నించాం. ముందుగా నష్టపరిహారంతో బకాయిలను క్లియర్ చేయమని సూచించాం. అయినప్పటికీ వారు రాజీకి నిరాకరించారు. నా ప్రతిష్టను దిగజార్చే విధంగా నా పేరును ఉపయోగించారు.. ఇది ఆమోదయోగ్యం కాదు!" అని పాయల్ ఆరోపించారు. తన బకాయిలను క్లియర్ చేయకుండా, తన అనుమతి లేకుండా సినిమాను విడుదల చేయాలనుకుంటున్నందున మేకర్స్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నట్లు ఈ నోట్ లో రాసింది.

## కీర్తి సురేష్ 'బుజ్జి'.. గేమ్ ఛేంజర్ అవుతుందా?



హీరోయిన్ కీర్తి సురేష్ కు సౌత్ సినీ ఇండస్ట్రీలో స్పెషల్ క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. హెరాయిన్ల బ్యూటీ ఇమేజ్ తో పాటు గ్లామర్ ఇమేజ్ కూడా కీర్తి సురేష్ సొంతం. అందం, అభినయంతో తనదైన శైలిలో అలరిస్తోంది. మహానటి సినిమాతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న కీర్తి.. ఇప్పుడు వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉంది. ముఖ్యంగా దసరా, మమ్మానమ్ వంటి పలు సినిమాలు కీర్తి కెరీర్‌కు మంచి బూస్టప్ ఇచ్చాయని చెప్పవచ్చు. ప్రస్తుతం కోలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తోంది కీర్తి సురేష్. దాంతోపాటు బాలీవుడ్ డెబ్యూ బేబీ జాన్‌లో నటిస్తోంది. వరుణ్ ధావన్ సరసన ఆ మూవీలో యాక్ట్ చేస్తోంది కీర్తి. దీంతోపాటు మరిన్ని అవకాశాలు ఆమె అందుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల అక్క అనే వెబ్ సిరీస్ కూడా కమిట్ అయింది కీర్తి. ఈ వెబ్ సిరీస్ లో హీరోయిన్ రాధికా ఆప్టే కూడా నటిస్తోంది. ఇద్దరూ కూడా గ్లామర్ షో చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇక డిఫరెంట్ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నా కీర్తి సురేష్.. రీసెంట్‌గా మరో ఆఫర్ దక్కించుకున్న విషయం తెలిసిందే. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కల్కి 2898 ఏడీ మూవీలో భాగమైంది. సినిమాలోని ప్రభాస్ స్పెషల్ వెహికల్ బుజ్జికి సంబంధించిన ఏఐ రోబో గ్యాడ్జెట్ కు వాయిస్ ఓవర్ ఇచ్చింది. మేకర్స్ నిన్న గ్లింప్స్ రిలీజ్ చేశాక.. అందరూ గ్యాడ్జెట్‌కు కీర్తి సురేష్ వాయిస్ ఓవర్ బాగా సెట్ అయిందని నెట్టింట కామెంట్లు పెడుతున్నారు. అందుకోసం కీర్తి బాగా కష్టపడినట్లు కూడా తెలుస్తోందని చెబుతున్నారు. ఎందుకంటే.. ఈ గ్లింప్స్‌లో డైలాగ్స్ డిఫరెంట్ వేరియేషన్స్‌లో ఉన్నాయి. దీంతో సందర్భానుసారం కీర్తి సురేష్ వాయిస్ ఓవర్ పర్ఫెక్ట్‌గా ఇచ్చిందని కొనియాడుతున్నారు. ఎంతైనా మహానటి కదా అంటూ ఆకాశానికెత్తేస్తున్నారు. అయితే ప్రస్తుతం తెలుగులో అవకాశాలు కోసం ఎదురుచూస్తోంది కీర్తి. పాన్ ఇండియా లెవెల్‌లో క్రేజీ దక్కించుకోవాలని ట్రై చేస్తోంది. ఇదే సమయంలో పాన్ ఇండియా మూవీ కల్కిలో కీర్తి సురేష్ భాగమవ్వడం విశేషం. దానికి తోడు.. అమ్మడు వాయిస్ ఓవర్ అందించిన గ్యాడ్జెట్ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కీర్తి సురేష్.. ఆ గ్యాడ్జెట్ వల్ల పాన్ ఇండియా లెవల్ లో క్రేజ్ సంపాదించుకునే అవకాశం ఉందని ఫ్యాన్స్ చెబుతున్నారు. మరి కల్కి 2898 ఏడీ మూవీ.. కీర్తి సురేష్ కు గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందా లేదా అనేది తెలియాలంటే వేచి చూడాలి.

## పవన్ సినిమా కోసం టబు... నిజమేనా?





సౌత్ నుంచి వెళ్లి బాలీవుడ్‌లో పర్మినెంట్ గా స్థిర పడ్డ హీరోయిన్ టబు. ఉత్తరాదిన స్టార్ హీరోయిన్‌గా మారిన తర్వాత తెలుగు లో టబు పెద్దగా చేసిందే లేదు. అయితే అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబోలో వచ్చిన బ్లాక్ బస్టర్ అల వైకుంఠపురంలో సినిమా తర్వాత టబు వరుసగా తెలుగు సినిమాలు చేస్తుందని అంతా భావించారు. ఆ సినిమా భారీ బ్లాక్ బస్టర్ అయిన తర్వాత టబు వద్దకు చాలా మంది తెలుగు దర్శక నిర్మాతలు వెళ్లారట. కానీ టబు హిందీ సినిమాలకే మొదటి ప్రాధాన్యత ఇస్తూ వచ్చింది. పవన్ కళ్యాణ్ తో సాహెూ సుజీత్ రూపొందిస్తున్న ఓజీ సినిమా కోసం కూడా టబు ను సంప్రదించారు అనే ప్రచారం జరుగుతోంది. ఓజీ సినిమాలోని ముఖ్య పాత్రకు టబును అనుకున్నారని, కానీ ఆమె నుంచి స్పందన లేక పోవడంతో ఆ పాత్రకు శ్రియా రెడ్డిని తీసుకున్నారు అనే ప్రచారం జరుగుతుంది. ఆ విషయం నిజమే అన్నట్లుగా తాజాగా ఒక ఇంటర్వ్యూలో శ్రియా రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. శ్రియా రెడ్డి నటించిన ఓ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కు రెడీ అయ్యింది. ఆ వెబ్ సిరీస్ ప్రమోషన్ లో భాగంగా టబు అంటే తనకు చాలా అభిమానం అని, ఆమె చేయాల్సిన ఒక తెలుగు సినిమా పాత్రను నేను చేస్తున్నాను అంటూ చెప్పుకొచ్చింది. శ్రియా రెడ్డి చెప్పింది ఓజీ లో తాను చేస్తున్న పాత్ర గురించి అయ్యి ఉంటుందని చాలా మంది భావిస్తున్నారు. కానీ కొందరు మాత్రం సలార్ లో రాధా మన్నార్ పాత్రకు టబును అనుకున్నారా.. టబు అందుకు నో చెబితే శ్రియా రెడ్డిని తీసుకున్నారా అనే అనుమానాలను కూడా వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి తెలుగు లో ఒక స్టార్ హీరో సినిమాను టబు కాదు అనుకోవడం, ఆ సినిమాలో శ్రియా రెడ్డి నటించడం అనేది కన్ఫర్మ్. ఆ సినిమా ఏది అనేది మాత్రం అనేక పుకార్లు ఉన్నాయి. అఫిషియల్ గా శ్రియా రెడ్డి పేరు చెబితే కానీ క్లారిటీ వచ్చే అవకాశం లేదు. ఏది ఏమైనా టబు తెలుగు సినిమాలను తిరస్కరించడం సరైన నిర్ణయం కాదని తెలుగు సినీ ప్రేమికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# అనకాపల్లిలో జూ.ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి ఎన్టీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో యంగ్ టైగర్ నందమూరి తారక రామారావు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముందుగా అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఎన్టీఆర్ పేరు మీద గోత్ర నామాలతో అభిషేకాలు జరిపించారు అనంతరం సుందరయ్య పేట లో గల హృదయ శాంతి వృద్ధ ఆశ్రమంలో ఉదయం పలహారం మధ్యాహ్నం సుమారు వందమంది ఆశ్రమ వాసుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి వృద్ధులకు అనాధలకు అందరికీ భోజనం ఏర్పాటు చేశారు. అలాగే రాత్రికి కూడా భోజన ఏర్పాట్లు చేశారు స్థానిక శిరిడి సాయి పత్తి సాయి థియేటర్లో భారీ కేక్ కటింగ్ కార్యక్రమం చేశారు ఈ పుట్టినరోజు కార్యక్రమంలో సేవ సమితి సభ్యులందరూ పాల్గొన్నారు ఈ కార్యక్రమమంలో సేవా సమితి సభ్యులు సూరిశెట్టి రమణ కుమార్, బుద్ధ జగదీష్ గాంధీ, అల్లు సురేష్, సరగడం శంకర్ (కటక్), కొయిలాడ ఈశ్వర్, బొడ్డేడ గిరీష్ ఈశ్వర్, కరణం సర్వేశ్వరరావు, కాలేపు సాయి, తదితరులు పాల్గొన్నారు.

# కిర్గిస్థాన్ విద్యార్థులతో మాట్లాడిన జీవీఎల్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విదేశాంగ మంత్రి డా. ఎస్. జైశంకర్‌తో సంప్రదించిన తర్వాత, బిజెపి సీనియర్ నాయకుడు జీవీఎల్ నరసింహారావు ఈరోజు కిర్గిజ్‌స్థాన్‌లోని భారత రాయబారి అరుణ్ కుమార్ ఛటర్జీతో సుదీర్ఘంగా సంభాషించారు.

రాయబారి ఛటర్జీ కిర్గిజ్‌స్థాన్‌లో పరిస్థితిని సవివరంగా వివరించారు. కిర్గిజ్‌స్థాన్‌లో 17,000 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారని, వారిలో 6,000 మంది మాత్రమే కిర్గిజ్‌స్థాన్ రాజధాని నగరమైన బిష్‌కెక్‌లో చదువుతున్నారని శ్రీ ఛటర్జీ శ్రీ నరసింహారావుకు తెలియజేశారు.

మే 17/18న బిష్‌కెక్‌లో విదేశీ విద్యార్థులపై మూకుమ్మడి దాడికి పాల్పడిన ఒక తీవ్రమైన సంఘటన తప్ప, బిష్‌కెక్‌తో సహా కిర్గిజ్‌స్థాన్ అంతటా పరిస్థితి శాంతియుతంగా ఉందని రాయబారి ఛటర్జీ శ్రీ జీవీఎల్ నరసింహారావుకు తెలియజేశారు.

విద్యార్థుల భద్రత కోసం ప్రస్తుత పరిస్థితి "పూర్తిగా సాధారణం" అని మరియు స్థానిక ప్రభుత్వ అధికారులు బిష్కెక్‌లో భద్రతను భారీగా పెంచారని రాయబారి ఛటర్జీ పేర్కొన్నారు. విద్యార్థులు పుకార్లను నమ్మవద్దని, ఏదైనా ఆందోళన ఉంటే ఎంబసీలోని ఎమర్జెన్సీ నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఈ విషయంపై జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయుల భద్రతా సమస్యలను ఎల్లప్పుడూ చాలా జాగ్రత్తగా చూసుకుంటుందని, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు కేంద్ర ప్రభుత్వంపై, భారత రాయబార కార్యాలయంపై విశ్వాసం కలిగి ఉండాలని మరియు దాని సూచనలను అనుసరించాలని అన్నారు. "బిష్‌కెక్‌లో జరుగుతున్న పరిణామాలను పర్యవేక్షిస్తూనే ఉంటాను మరియు ఏవైనా ఆందోళన పరిస్తితులు ఉద్భవిస్తే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాను" అని జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు.

# పోలింగ్ సర్టిఫికెట్లకై కలెక్టర్‌ను కలిసిన ఏపీటీఎఫ్

**శ్రీకాకుళం, (విశాఖ సమాచారమ్):** పోలింగ్ ప్రక్రియకు సంబంధించి పోలింగ్ అధికారుల సమస్యలపై దృష్టి పెట్టాలని ఏపీటీఎఫ్ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి, ముఖ్యంగా పోలింగ్ అధికారులుగా పాల్గొన్న ఉపాధ్యాయులకు సంబంధించి కొన్ని అంశాలను లేఖ రూపంలో కలెక్టర్ గారిని కలిసి విన్నవించడం జరిగింది. వివిధ సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ, పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినందుకు మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ ముఖ్యమైన ప్రజాస్వామ్య ఎన్నికలలో భాగం కావడం మనందరికీ నిజంగా గర్వకారణం. నిబంధనల ప్రకారం వేసవి సెలవుల్లో పోలింగ్ విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు తమ సర్వీస్ కోసం ఆర్జిత సెలవులకు అర్హులు. కావున, మూడు రోజుల పోలింగ్ డ్యూటీకి పనిచేసిన అధికారులందరికీ డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయవలసిందిగా కోరడం జరిగింది. ఇంకా, పోలింగ్ అధికారులకు చెల్లించే పారితోషికంలో, ముఖ్యంగా %ఫ్రూూ%లకు సంబంధించి వ్యత్యాసాలు ఉన్నాయి. మన రాష్ట్రం, ఇతర జిల్లాల్లో గత ఎన్నికలతో పోలిస్తే ఓపీఓలకు పారితోషికం గణనీయంగా తగ్గింది. అంతేకాకుండా, PO/APO లకు (ప్రిసైడింగ్ ఆఫీసర్లు/అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు) రిమినరేషన్ సరిపోతుందని అనిపించినప్పటికీ, ఇతర జిల్లాల తో పోలిస్తే మన జిల్లాలో నిర్వహిస్తున్న అదనపు శిక్షణలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు అది



తక్కువగా ఉంటుంది. మన జిల్లాలో అధికారులు అదనంగా మరో మూడు శిక్షణా సమావేశాలకు హాజరైనందువల్ల వారికి ఇవ్వబడిన పరిహారం తక్కువగానే ఉంది. ఈ పరిహార వ్యత్యాసాలు సరి చేయాల్సిందిగా కోరడం జరిగింది. ఇంటింటికి ఓటు వేయడానికి డ్యూటీ చేసిన ఉపాధ్యాయులకు విధి నిర్వహణకు రెమ్యూనరేషన్ మరియు ఈ ప్రయోజనం కోసం అదనపు శిక్షణా కాలానికి రెమ్యూనరేషన్ చెల్లించలేదు.

ఈ సమస్యలను పరిష్కరించాలని మరియు ఉపాధ్యాయులందరికీ రెమ్యూనరేషన్లు మరియు డ్యూటీ సర్టిఫికేట్ జారీ చేయడంలో ఉన్న వ్యత్యాసాలను సరిచేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ వారిని కోరుతూ మెమోరాండం సమర్పించడం జరిగింది. జిల్లా కలెక్టర్ గారిని కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ జిల్లా కార్యదర్శి చావలి శ్రీనివాస్ సీనియర్ నాయకులు సదాశివుని శంకరరావు పాల్గొన్నారు.

# నూతన తారాగణంతో... విశాఖ లో ఓ సినీ "దర్శిని" -ఓ అద్భుతం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సినిమా మన జీవితంలో ఒక అద్భుతం ఒక కొత్త సినిమా నిర్మించే ప్రతి ప్రయత్నాన్ని అభినందించాల్సిందే సినిమా రాజధానిగా పేరు తెచ్చుకుంటున్న విశాఖలో సినిమాలు ఎక్కువగా ప్రారంభిస్తున్న సందర్భం ఎక్కువ. ఈ దశలో నూతన తారాగణంతో వికాస్, శాంతి జంటగా డాక్టర్ ప్రదీప్ అల్లు దర్శకత్వంలో వి4 సినీ క్రియేషన్స్ బ్యానర్ పై డాక్టర్ యల్. వి. సూర్యం నిర్మాతగా తెరకెక్కిన సినిమా దర్శిని. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా సినీ ప్రేక్షకులను కనువిందు చేసేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలలో సుమారు వంద థియేటర్లో ఈనెల 17 న విడుదలై ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

సంతోష్ (వికాస్) ప్రియా (శాంతి) తమ ఫ్రెండ్ తో కలిసి డాక్టర్ దర్శని ఇంటికి వస్తారు. ఇంతకీ, ఈ డాక్టర్ దర్శని ఎవరు, భవిష్యత్తులో ఏం జరుగుతుందో ముందే చూడగలిగే ఒక టెక్నాలజీ కనిపెట్టింది ఎవరు, భవిష్యత్తును చూపించే టెక్నాలజీని దర్శకుడు ఇక్కడ ఆవిష్కరించిన తీరు ఈ చిత్రంలో గొప్ప విషయం. ఈ టెక్నాలజీ కారణంగా సంతోష్ - ప్రియా జీవితాల్లో చోటు చేసుకున్న నాటకీయ సంఘటనలు ఏమిటి, ఇంతకీ, సంతోష్ - ప్రియా ప్రేమ వ్యవహారం ఎలా సాగింది, ఈ మధ్యలో వాళ్ళకు ఎదురైన ఇబ్బందులు ఏమిటి అనేది ముఖ్య కథ.

ఈ సినిమాలో హీరోగా నటించిన వికాస్ తన డైలాగ్ డెలివరీ, తన బాడీ లాంగ్వేజ్ తో అలాగే, కొన్ని ఎమోషనల్ అండ్ సస్పెన్స్ సీక్వెన్స్ స్ లో చాలా బాగా నటించాడు. మరో ప్రధాన పాత్రలో నటించిన వెంకట సత్య ప్రసాద్ ప్రేక్షకులకు గుర్తుండే పాత్ర. ఇక సింగూరు వినోద్ తన పాత్ర పరిధిలో నటించాడు హీరోయిన్ శాంతి హెూమ్లీ లుక్స్ లో ఉన్నప్పటికీ నటన పరంగా ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా లేదు. అయితే నూతన కథాంశం పరంగా పర్వాలేదు. ఇలా బడ్జెట్ సినిమా తీసినప్పుడు ఒకటికి పదిసార్లు ఆలోచించి తీయాలి. కొన్ని లోపాలున్నా ఇదొక మంచి ప్రయత్నం ఎందుకంటే థియేటర్లకి జనం వచ్చే సంస్కృతి కనుమరుగవుతున్న ఈ తరుణంలో ఈ రంగానికి సినీ యువత వచ్చి ప్రేక్షకులను పెంచేందుకు కృషి చేయాలి.

ఇక దర్శకుడుగా డాక్టర్ ప్రదీప్ అల్లు కథా పరంగా విజయం సాధించాడు కాని కథనం విషయంలో ఇంకా జాగ్రత్త తీసుకొని ఉండాల్సింది. దర్శిని 2 కి ఈ జాగ్రత్తలు పాటిస్తే మంచిది ముఖ్యంగా హీరోయిన్ విషయంలో పునరాలోచన జరగాలి ఫోటోగ్రఫీ పర్వాలేదు నేపథ్య సంగీతం బాగుంది. పాటలు చాలా బాగున్నాయి. ఎడిటింగ్ సోసోగా ఉంది ఇంకా బాగా చేయాలి. ఇక ఈ చిత్రాన్నికి ఓటీటిలో మంచి ఆదరణ లభించే అవకాశం మెండుగా ఉంటుంది ఎందుకంటే ఈ కొత్త పాయింట్ తో ఉన్న కథాంశాన్ని ఓటీటి ప్రేక్షకులు తప్పకుండా చాలా బాగా ఆదరిస్తారు అక్కడ విజయం సాధించి తీరుతారు దర్శిని 2 కి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇక నిర్మాత యల్.వి. సూర్యం ఇటువంటి చిత్రాలను నిర్మించి అందరికీ ఆదర్శం కావాలి. అందరూ కొత్త వారే అందులోనూ అందరూ విశాఖ వారే కావడం మరీ విశేషం. తెలుగు సినీ ప్రేక్షకులు ప్రతీ ఒక్కరూ "దర్శిని" చిత్రాన్ని చూసి ఆదరించండి.

# సైన్స్- ఫిక్షన్ -థ్రిల్లర్, చిత్రం.. దర్శిని





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సంతోష్( వికాస్) ప్రియా( పి. శాంతి ప్రియ) హీరో హీరోయిన్లుగా, డాక్టర్ ప్రదీప్ అల్లు దర్శకత్వంలో, వి ఫోర్ క్రియేషన్స్ పథకంపై, ఎల్వి సూర్యం నిర్మాతగా, ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన చిత్రం,- దర్శిని.. ఇటీవలే ఈ చిత్రం. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 100కు పైగా థియేటర్లలో విడుదలై, అఖండ ప్రేక్షక ఆదరణ పొందుతుంది. సైన్స్ ఫిక్షన్ హర్రర్, సినిమాలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడతారని,, మరో మారు నిరూపించారు. దర్శకుడు.. ఆత్మవిశ్వాసముతో కథను అల్లుకొని,, సృజనాత్మకతతో, సూక్ష్మ పరిశీలన చేసి, ప్రతి సన్నీ వేషానికి మెరుగులు దిద్ది,, యువతరాన్ని ఆకట్టుకొని, ఉత్కంఠత నెలకొల్పి, ప్రేక్షకుడ్ని, కుర్చీకే కట్టిపడేసే, క్రియేటివ్ డైరెక్టర్, ప్రదీప్ అల్లు-.. తెలుగు తెరకు తొలి పరిచయ మైనా.. తర తరాలకు, గుర్తుండిపోయే పోయే పాత్రలు పోషించారు. ప్రధాన తారాగణం ఇక కథ విషయానికి వస్తే,, సంతోష్ ప్రియ లివింగ్ స్టోన్,, ముగ్గురు ఫ్రెండ్స్, ముగ్గురూ కలిసి కొన్ని రోజులు ఔటింగ్ కి వెళ్దాం అనుకొని, దర్శిని అనే సైంటిస్టు ఫాంహౌస్ కి వెళతారు, అక్కడ ముగ్గురు , భవిష్యత్తును కనిపించే మిషన్ ను చూస్తారు భవిష్యత్తును చూపించి స్క్రీన్ పై చూసింది , నెక్స్ డే తమ లైఫ్ లో జరుగుతుంది. ఎప్పుడైతే ఆ మెషిన్ ఆక్టివేట్ అయిందో, ప్రతిరోజు నెక్స్ డే అదే టైం కి, జరిగే దాన్ని చూపిస్తుంది. డాక్టర్ సైంటిస్టు అయిన దర్శిని, కనిపించకపోవడంతో వెతుకుతుంటే అదే ఫామ్ హౌస్ లో శవంలా కనిపిస్తుంది.. ఇలాంటి సైన్స్ ఫిక్షన్ మూవీ లో లో, సమాంతరంగా, అద్భుతమైన ప్రేమ కథ కూడా నడుస్తుంది. ఇంపైన సంగీతం. ఊహించని క్యూరియాసిటీ. తో ఆకట్టుకున్నారు .. సినిమాలో పాటలన్నీ బాగున్నాయి. నాలో ఏవో సరిగమలై.. గుండెలోని గాయమా... నేను చూశాను,,, ఏకాంతములు పరవశమాయే ఓ చిత్రమా.. తదితర పాటలు, ప్రముఖ సింగర్స్ అయినా, చిత్ర, సునీత జావేద్ అలీ, చిన్మయి శ్రీపాద ఉన్ని కృష్ణన్, నరేష్ అయ్యర్ తదితరులు పాడారు.

ఇంకా ఈ సినిమాలో, కళ్ళెంపూడి వాహిని, వినోద్ కుమార్ సింగూరు, సంతోష్ కుమార్, శ్రావ్య రాయి శశికాంత్ తదితరులు కాగా .. సౌండ్ ఇంజనీరింగ్: దామోదర్, పి ఆర్ ఓ: పాల్ పవన్, డి ఐ టి : డాక్టర్ సత్య ప్రసాద్. సంగీతం: రవి మిల్కీ-!

Authorised System Solution Provider for
VOLTAS
A TATA Enterprise
Md. Ibrahim Khaleel
M: 094402 11943
9 Planet Solutions
HVAC - VRF PROJECTS SALES & SERVICES
Our Services that will make you cool
Head Office
Plot No.P-58, Flat No.101, Taj Residency
Ashok Vihar Colony, Upparpally,
Hyderabad-500030, Telangana State,
E: 9planetsolutions2009@gmail.com
Branch Office
#13-2-18/4,Anthony Nagar,
Beside St.Anthony's High School,
Maharanipeta,Visakhapatnam-530002
Andhra Pradesh.

Sugar Free Fitearly
నడివయస్కులకు దివ్య శక్తి ఫిట్ ఎర్లీ
थकावट से सत्वर उपसमन फिट एर्ली
వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?
మందులు మింగలేక, చక్కెరతో కూడిన ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?
దిగులు చెందకండి.
"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.
సోయప్రోటీన్, వే ప్రోటీన్, బ్రాహ్మి, హరితకి, సీ భక్తారన్, శొంఠి, తులసి, అశ్వగంధ
తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ఠ వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్ఠానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కరమైన ఫలితాలను ప్రకటించుకోబడిన ఉపాహారం

ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి
ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179
ఈ-మెయిల్: surampudi43@gmail.com
HERBINDO LABS PRIVATE LIMITED
HEALTH AND HAPPINESS
Compli
HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa,
Street No 16,
Amberpet, Hyderabad - 500013,
Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Parawada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 94937 77390, 7382585777. Arilova : 90149 11305 Maddilapalem : 99084 24231, Yelamanchili : 9441356676